


గోవిందా..?

● తిరుమలలో పెరిగిపోతున్న శబ్దకాలుష్యం

శేషాచలం కొండల్లో ఆకుపచ్చని అడవి ఒడిలో ఒదిగినట్టుగా ఉండే చల్లని, ప్రశాంత ప్రదేశం తిరుమల. మంద్రంగా వినిపించే గోవిందలు.. అన్నమయ్య కీర్తనలు.. శ్రీవేంకటేశ్వరుని దర్శనం కోసం వచ్చే భక్తులు ఈ వాతావరణంలో సకల పరుగులనూ మరచి సేదదీరుతారు. అయితే ఈ ప్రశాంతత కొన్నేళ్లుగా భగ్నం అవుతోంది. శబ్ద కాలుష్యం తిరుమల కొండల హద్దులు దాటేస్తోంది. అసాధారణ స్థాయిలో శబ్దకాలుష్యం నమోదవుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఉండాల్సిన శబ్దస్థాయి..

యూనివర్సిటీలు, ఆస్పత్రులు, ఆలయాలు వంటి వాటిని సైలెంట్ జోన్లుగా పరిగణిస్తారు. ఈ ప్రదేశాల్లో పగటి పూట 50, రాత్రి వేళలో 40 డెసిబెల్స్ కంటే ఎక్కువగా శబ్దాలు ఉండకూడదు. అనారోగ్యంతో ఉన్నవారికి, విద్యార్థులకు, దేవుడి సన్నిధిలో గడుపుదామని వచ్చిన వారికి శబ్దం ఒక శత్రువు. నివాస ప్రాంతాల్లో పగలు 55, రాత్రి 45 డెసిబెల్స్ దాకా భరించవచ్చు. వాణిజ్య ప్రాంతాల్లో ఇది 65-55 దాకా అనుమతి ఉంటుంది. పారిశ్రామిక వాడల్లో ఇది 75-70 గా ఉంటుంది.

తిరుమలలో ఇలా ఉంది..

గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు రికార్డులను పరిశీలిస్తే తిరుమలలో సగటున పగటి వేళల్లో 60.5, రాత్రి వేళల్లో 59.68 డెసిబెల్స్ వరకు నాయిస్ లెవల్స్ నమోదయ్యాయి. అంటే వాణిజ్య ప్రాంతాల్లో ఉన్నంత శబ్దం తిరుమలలో ఉంటోందన్నమాట. కొన్ని సందర్భాల్లో ఇండస్ట్రియల్ జోన్ స్థాయి శబ్దాలు కూడా తిరుమలలో నమోదయ్యాయి. దీంతో ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతింటోంది. భక్తులు చెవులు మూసుకుని, మొఖం చిట్లించుకుని తిరుగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

హారన్ల మోత!

ప్రతిరోజు 7 నుంచి 10 వేల వాహనాలు తిరుమలకు చేరుకుంటున్నాయి. రద్దీరోజులు, విశేష పర్వదినాల్లో వీటి సంఖ్య మరింతగా పెరిగిపోతుంది. వీటిలో ఆర్టీసీ బస్సులు, భక్తుల వాహనాలు, ట్యాక్సీలు, ద్విచక్ర వాహనాలు, లారీలు, టీటీడీ అధికారులు కార్లు, ఉద్యోగుల బస్సులు ఉంటాయి. కొవిడ్ తర్వాత దాదాపు 75 శాతం భక్తులు సొంత వాహనాల్లోనే తిరుమలకు చేరుకుంటున్నారు. ఫలితంగా తిరుమలలో విపరీతంగా వాహనాల రద్దీ పెరిగిపోతోంది. ముందుకు కదిలేందుకు హారన్లు మోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. కాలంచెల్లిన ట్యాక్సీలు, వాహనాల ద్వారా కూడా వాయు, శబ్ద కాలుష్యాలు తిరుమలలో పెరిగిపోతున్నాయి. జన సందడి పెరగడంతో టీటీడీ బ్రాడ్‌కాస్టింగ్‌లో కూడా నాయిస్ లెవల్స్ ఎక్కువగా నమోదు అవుతున్నాయి.



అధ్యక్షా..

విదేశీ ఎంబీబీఎస్ ఇంటర్న్‌షిప్ కాలపరిమితి తగ్గించండి

విదేశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రస్తుతమున్న ఇంటర్న్‌షిప్ కాలపరిమితిని ఏడాది తగ్గించాలి. విదేశీ ఎంబీబీఎస్ విద్యను అభ్యసించిన విద్యార్థులు డాక్టర్ల అర్హతా ప్రవేశ పరీక్ష పాసైన తరువాత ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. 2021వ సంవత్సరం వరకు ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ చేస్తే సరిపోయేది. కొవిడ్, ఇతర సమస్యల వల్ల కాలేజీలకు వెళ్లి ఇంటర్న్‌షిప్ చేయలేని పరిస్థితుల్లో ఆన్‌లైన్‌లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి వచ్చింది. దీంతో ఎన్ఎంసీ ఇంటర్న్‌షిప్‌ను రెండేళ్లకు పెంచిందన్నారు. ఆ ఇంటర్న్‌షిప్ పూర్తయి ఉద్యోగం వచ్చేందుకు మరో ఆరు నెలలు సమయం పడుతుండటంతో వైద్యవిద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం దేశంలో డాక్టర్ల కొరతను దృష్టిలో ఉంచుకుని ఇంటర్న్‌షిప్‌ను ఏడాదికి కుదించేలా ఆరోగ్యశాఖా మంత్రి చర్యలు తీసుకోవాలి.

- విజయశ్రీ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

అమ్మ అలక చూడతరమా!



● వైభవంగా ఆదిదంపతుల పల్లకి సేవ

శ్రీకాళహస్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరుడి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పల్లకి సేవ వైభవంగా జరిగింది. గంగాదేవిని వివాహమాడాడని తెలిసి పరమశివుడిపై అలకబూనిన ఆదిశక్తిని బుజ్జగించేందుకు పరమశివుడు ప్రయత్నించడమే పల్లకి సేవలో ప్రధానాంశం. జ్ఞానప్రసూనాంబ దేవి పల్లకిలో ఆశీనురాలై ఎదురుగా ఉన్న దర్పణంలో భక్తులకు దర్శనమిస్తారు. సౌందర్య లహరి అయిన ఆదిశక్తి అలకలోనూ అద్వితీయమైన తేజస్సుతో భక్తులకు దర్పణంలో దర్శనమిచ్చారు. తొలుత ఆలయంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులను విశేష స్వర్ణాభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి హారతులు సమర్పించారు. అనంతరం వాహన మండపం వద్ద విద్యుత్తు కాంతులతో సిద్ధమైన పల్లకీల్లో ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. సకల పరివార దళం ముందు సాగగా స్వామి, అమ్మవార్లు చిద్విలాసులై భక్తులకు దర్శనభాగ్యం కల్పించి కరుణామృతం కురిపించారు. కోలాట నృత్యాలు, డ్రమ్స్ వాయిద్యాలు, కేరళవాయిద్యాలు, బ్యాండు, మంగళ వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శివనామస్మరణతో చతుర్మాడవీధులు మార్మోగాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లోనే పల్లకీ సేవ చిట్టచివరి ఊరేగింపుగా నిర్వహిస్తారు. అందుకని స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



పల్లకిలో.. ఎదురుగా దర్పణంలో అమ్మవారి ప్రతిబింబం



నేడు ఏకాంత సేవ

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ జరగనుంది. ఆలయంలోని అమ్మవారి సన్నిధిలో ఉన్న పళ్లియర (శయన మందిరం)లో ఈ క్రతువును నిర్వహించనున్నారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను వెండి పల్లకిలో ప్రదక్షిణగా తిప్పి శయన మందిరంలో కొలువుదీర్చనున్నారు.

రేపటినుంచి ఆర్జిత సేవలు ప్రారంభం

ముక్కంటి ఆలయంలో స్వామిఅమ్మవార్లకు నిర్వహించే ఆర్జిత సేవలు గురువారం నుంచి తిరిగి ప్రారంభించనున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఫిబ్రవరి 21 నుంచి ఆలయంలో ఆర్జిత సేవలను రద్దుచేసి ఏకాంతంగా నిర్వహిస్తున్నారు. బుధవారంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి. ఈక్రమంలో గురువారం నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు తిరిగి అందుబాటులోకి రానున్నాయి.

ఫ్లై ఓవర్‌పై అతివేగం

● 'గరుడ వారధి' రక్షణ గోడను ఢీకొన్న బైకు
● పైకి ఎగిరి పడిన యువకులు
● ఒకరి దుర్మరణం.. మరొకరికి తీవ్రగాయాలు



దెబ్బతిన్న బైక్



గరుడ వారధి రక్షణ గోడపై అభిరామ మృతదేహం



అభిరామ నాయుడు (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): గరుడ వారధి ఎక్కారు. బైకును మితిమీరిన వేగంతో నడిపారు. రామానుజం సర్కిల్ వద్ద బైకును అదుపు చేయలేక రక్షణ గోడను ఢీకొన్నారు. ఇద్దరు యువకులు పైకి ఎగిరి పడ్డారు. రక్షణ గోడపైన పడిన అభిరామా నాయుడు మృతిచెందగా.. రోడ్డుపై పడిన సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతిలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన అభిరామా నాయుడు.. తిరుపతిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీ-టెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సహ విద్యార్థి సునీల్‌తో కలిసి తిమ్మినాయుడుపాలెంలో ఒక గదిని అద్దెకు తీసుకుని వుంటున్నారు. వీరిద్దరూ కలసి ద్విచక్ర వాహనంలో తిరుచానూరుకు వెళ్లారు. మంగళవారం వేకువజామున తిరుగు ప్రయాణంలో స్థానిక మామిడి కాయల మండీ వద్ద గరుడ వారధిపైకి ఎక్కారు. ఆర్టీసీ బస్టాండు వైపు అతివేగంతో వేగంతో వస్తున్నారు. రామానుజపల్లి సర్కిల్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే వున్న డివైడర్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో మదనపల్లెకు చెందిన అభిరామా నాయుడు (24) డివైడర్‌పై పడి తలకు బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడివెనుక కూర్చుని ఉన్న సునీల్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడ్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ఘటనకు ప్రధాన కారణం అతివేగం.. నిర్లక్ష్యమే కారణమని ఎస్ఐ చెప్పారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేశారు.

మేమింతే.. మారమంతే! - 8లో

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

● 15 కిలోలు స్వాధీనం

రేణిగుంట మార్చి4(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే స్టేషన్‌లో అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని, 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు రైల్వే సీఐ యతేంద్ర తెలిపారు. సోమవారం సాయంత్రం 3వ నెంబర్ ప్లాట్‌ఫారంలో జీఆర్‌పీ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన మిల్టాస్ షిక్, మదాస్ అనుమానాస్పద రీతిలో తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకొని సోదాలు చేశామన్నారు. వారి వద్ద రూ.45 వేల విలువచేసే 15 కిలోల గంజాయి ఉండగా స్వాధీనం చేసుకొని మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.24
సహరి (గురువారం) : 5.07

ఇంటర్ పరీక్షలకు 827మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీయట్ ప్రథమ సంవత్సర పరీక్షలకు మంగళవారం జిల్లాలో 827 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విభాగంలో జిల్లాలో 101 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 33,294మందికి గాను 32,467మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.



తల్లి ఒడి చేరిన చిన్నారి

తిరుమల, మార్చి4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కనిపించకుండాపోయిన బాలిక క్షేమంగా తల్లి ఒడికి చేరింది. తిరుమలలో చిరువ్యాపారులుగా ఉన్న విజయవాడకు చెందిన కరుణశ్రీ, నరసింహులు కూతురు నాలుగేళ్ల దీక్షిత ఆస్థానమండపం వద్ద ఆడుకుంటుండగా సోమవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. వీరు రాత్రి 7.30 గంటల సమయంలో పోలీసులను ఆశ్రయించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించి ఒక మహిళ వెంట పాప తిరుపతికి వెళ్లినట్టు నిర్ధారించుకున్నారు. ఆ మహిళ ధరించిన దుస్తులు ఆధారంగా తిరుమలలోనే పని చేసే పారిశుద్ధ్య కార్మికురాలుగా గుర్తించారు. వెంటనే తిరుపతిలోని పోలీసులను అప్రమత్తం చేసి బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లో రాత్రి 10.30 గంటల సమయంలో చిన్నారితో సహా మహిళను అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి 12.30 గంటలకు పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే పాప ఆచూకీ కనిపెట్టిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

నరసింహులు దంపతులకు దీక్షితను అప్పగిస్తున్న తిరుమల పోలీసులు

చెర్లోపల్లె సర్పంచికి కేంద్ర పురస్కారం

తిరుపతి (రూరల్/ఆటోనగర్), మార్చి4(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం చెర్లోపల్లె సర్పంచి బి.సుభాషిణికి జాతీయస్థాయి శక్త్ పంచాయత్ నేత్రి అభియాన్ పురస్కారం లభించింది. రాజకీయాల్లో ప్రాతినిధ్యం వహిస్తూ గ్రామ పంచాయతీలు, మండలాలను అభివృద్ధిపథంలో నడిపిస్తున్న మహిళలను జిల్లా పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవ సదస్సుకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా చెర్లోపల్లె పంచాయతీలో పలు అభివృద్ధి పనుల (సీసీరోడ్లు, యూడీఎస్)తో పాటు అదనపు ఆదాయాన్ని సమకూర్చేలా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసినందుకు పురస్కారం లభించింది. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన జాతీయ మహిళాదినోత్సవ సదస్సులో కేంద్ర పంచాయతీరాజ్‌శాఖామంత్రి రాజీవ్ రాజన్ సింగ్ చేతులమీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. రూరల్‌మండలంలో మహిళా సర్పంచ్‌ల కేటగిరీల్లో ఈమెని ఎంపిక చేశారు. అవార్డు అందుకున్న సర్పంచి సుభాషిణికి సీపీఐ రాష్ట్ర కార్యావర్గ సభ్యుడు ఎ. రామానాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.



కేంద్రమంత్రి రాజీవ్‌రాజన్ సింగ్ నుంచి పురస్కారం అందుకుంటున్న సుభాషిణి

హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



చంద్రగిరి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే ధ్యేయంగా వైద్య సిబ్బంది పనిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీ కృష్ణలు అన్నారు. పట్టణంలోని రెండవ సచివాలయంలోని హెల్త్ సెంటర్‌ను మంగళవారం వారు తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వ రూపొందించిన యాప్‌లో ప్రజల ఆరోగ్య స్థితిగతులను పొందుపర్చాలన్నారు. సమస్యలు లేకుండా చూడాలన్నారు. హెల్త్ సెంటర్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదని సిబ్బంది తెలిపారు. మరుగుదొడ్లు ఉన్న సింథటిక్ ట్యాంక్, వాటర్ సప్లై లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఆయన సర్పంచ్ రూప రామ్మూర్తికి ఫోన్ చేసి సమస్యను వివరించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

ఆస్టర్ నారాయణాద్రిలో విజయవంతమైన ప్రసవ చికిత్స



మాట్లాడుతున్న సునందకుమార్‌రెడ్డి, డాక్టర్ సృజన,తదితరులు

తిరుచానూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): క్లిష్టంగా మారిన గర్భిణి ప్రసవం విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి గైనకాలజిస్టు సృజన చెప్పారు. మంగళవారం ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ ఇటీవల 44 ఏళ్ల గర్భిణి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో తమ ఆస్పత్రిలో చేరిందన్నారు. రక్తపోటు అసాధారణ స్థితిలో ఉందన్నారు.. మూడవ నెలలో సర్వికల్ స్టిచ్ వల్ల వదులుగా మారిన గర్భసంచికి కుట్లు వేసి బిగువు చేశాన్నారు. గతంలో పలుమార్లు గర్భం నిలవలేదన్నారు. నిపుణుల సహకారంతో ఈమెకు సంబంధించి ఎదురైన క్లిష్ట సమస్యలన్నీ పరిష్కరించుకుంటూ విజయవంతంగా ప్రసవం జరిగేలా చూశామన్నారు. డాక్టర్ లతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తల్లి గర్భంలో పోషణ, ఆక్సిజన్ సరిగా అందక శిశువు 1.6కేజీలు పుట్టిందన్నారు. వెంటిలేటర్ సాయంతో శ్వాస అందించి శిశువు పేగుల్లోని ఇన్ఫెక్షన్ క్లియర్ చేయడంతో తల్లిపాలు జీర్ణం చేసుకోగలిగిందన్నారు. టోటల్ పేరెంట్ న్యూట్రిషన్ న్యూట్రిషన్ అందించామన్నారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉండటంతో మంగళవారం డిశ్చార్జి చేశామన్నారు. డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని, డాక్టర్లు ఎస్వీ ప్రసాద్, అనంత్‌పోజాల, ప్రతిమ పాల్గొన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

భాకరాపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో 2019కి ముందు వివాద రహిత భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు జనార్దన్‌రాజు తెలిపారు. ఆర్‌సీసీ పైకప్పు ఉండి ఇటుకల గోడతో నివాసయోగ్య నిర్మాణమై ఉండాలన్నారు. దరఖాస్తులను అధికారుల కమిటీ పరిశీలించి క్రమబద్ధీకరణకు అనుమతి ఇస్తుందన్నారు. స్లాబ్ మేరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హులైన వారు డిసెంబరు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎర్రావారిపాలెం: ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని తహసీల్దార్ పరమేశ్వర స్వామి తెలిపారు. ప్రభుత్వ భూములు, గయాలీ భూముల్లో ఇళ్లు నిర్మించుకొన్న వారు క్రమబద్ధీకరణకు ప్రభుత్వ అవకాశం కల్పించిందన్నారు. ఇంటి పన్ను రసీదు, విద్యుత్ బిల్లు, నీటి పన్ను లాంటి ఆధారాలతో సచివాలయ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివాదాల్లో లేని భూములై ఉండాలని స్పష్టం చేశారు.



తహసీల్దార్ పరమేశ్వరస్వామి

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



భాకరాపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు, భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సమకూర్చిన పరీక్షా సామగ్రిని టీడీపీ నేతలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కరీముల్లా, టీడీపీ నేతలు మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, దామోదర, లోకనాథం, చోటా సాహెబ్, చిట్టిబాబు నాయుడు, తులసీరాయల్, యశ్వంత్, గుర్రప్ప, ఎర్రయ్య నాయుడు, శ్రీనివాసులు, రఫీ, మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలో మాలపల్లె విద్యార్థుల ప్రతిభ

ఎర్రావారిపాలెం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీల్లో మాలపల్లె ప్రాథమిక పాఠశాల మొదటి బహుమతి గెల్చుకుంది. విద్యార్థులు పి యశ్వంత్, సరయు, షణ్ముఖప్రియలు పోటీల్లో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసవ రాజు నాగరాజు తెలిపారు. ఈ పోటీలు మంగళవారం తిరుపతిలోని ఎస్వీ క్యాంపస్ స్కూలులో జరిగాయన్నారు. విద్యార్థులకు మెమెంటో అందజేశారు. టీచర్ బసవరాజు నాగరాజును జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్, డీఈవో కుమార్,డీవైఈవో బాలజీ, ఎంఈఓ మధులు సన్మానించారు.



యశ్వంత్‌కు బహుమతి అందజేస్తున్న అధికారులు

చంద్రప్రభ వాహనంపై శ్రీనివాసుడి రాజసం



దర్బార్ అలంకారంలో వేంకటేశ్వరస్వామి - చంద్రప్రభ వాహనంపై స్వామివారు

శ్రీకాళహస్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమానుపురంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న అభయహస్త వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు చంద్రప్రభ వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. అంతకుముందు ఉదయం స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారు దర్బార్ అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి సర్వాలంకారభూషితుడైన స్వామివారు చంద్రప్రభ వాహనంపై ఆశీనులై గ్రామంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇంద్రవిమానంపై దేవేరులతో సుబ్రహ్మణ్యుడి విహారం

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో కొలువై ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో 53 వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం అమ్మవార్ల సమేత స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రంసుబ్రహ్మణ్యేశ్వరుడు ఇంద్ర విమానాన్ని అధిరోహించి పట్టణంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.



మామిడి దిగుబడిపై రైతుల దిగాలు

అప్పుల పాలయ్యా..



నాకు 20 ఎకరాల మామిడితోట ఉంది. గతంలో సేంద్రియ ఎరువులతో సాగు చేసేవాడిని. కొన్నాళ్ల పాటు లీజుకు ఇచ్చాను. అప్పటి నుంచి దిగుబడి రాలేదు. ఏటా నష్టపోతున్నా.

-బొడ్డు దొరస్వామినాయుడు, ఆరేనేపురం

నాలుగేళ్లుగా దిగుబడి లేదు



పదెకరాల మామిడి తోట ఉంది. ఏడాదికి ఎకరాకు కూలీలు, మందులు, దున్నకానికి రూ.40వేలు ఖర్చు అవుతోంది. నాలుగేళ్లుగా దిగుబడిలేక ఇబ్బందులు పడుతున్నా.

- చెంచురామిరెడ్డి, రైతు, గంగిరెడ్డిపల్లె

● ఎరువులు తెచ్చిన కష్టాలు
● నాలుగేళ్లుగా నష్టాలబాట

రామచంద్రాపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నాడు సిరులు కురిపించిన మామిడి నేడు సంక్షోభంలో పడింది. రైతులను నష్టాల పాల్జేస్తోంది. మండలంలో 30 ఏళ్ల క్రితం 750 ఎకరాల్లో మామిడి సేంద్రియ ఎరువులతో సాగయ్యేది. తర్వాత రైతులు అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువుల వాడకం మొదలుపెట్టారు. మరోపక్క ఉపాధి హామీ పథకంతో తోటలు పెరిగాయి. ప్రస్తుతం 4వేల ఎకరాల్లో తోటలు న్నాయి. కొన్నాళ్ల రసాయనిక ఎరువుల వాడకంతో దిగుబడి బాగుంది. మరోపక్క కాపు బాగా రావడానికి చెట్టు మొదళ్ల వద్ద రసాయనిక మందులు పెట్టారు. లాభాలు దండిగా వచ్చాయి.

రాన్రానూ రసాయన ఎరువుల చేటు గురించి రైతులకు తెలుసొచ్చింది. చెట్టు బలహీన పడి దిగుబడి తగ్గుతోందని గ్రహించారు. నాలుగేళ్లుగా 3 నుంచి 4సార్లు రసాయన ఎరువుల పిచికారీ చేసినా పూత నిలబడంలేదు. తేనె మంచు పురుగు సోకి పిందె రాకమునుపే పూత రాలిపోతోంది. దిగుబడి రాక నష్టపోతున్నారు. 20 ఏళ్ల పాటు పెంచిన చెట్టును రూ.750 నుంచి రూ.900కు అమ్మేస్తున్నారు. దిగుబడి వచ్చినా గోదాములు లేకపోవడం, జ్యూస్ ఫ్యాక్టరీలు, దళారీలు సిండికేట్ కావడం రైతులను మరింత నష్టపరుస్తున్నాయి. దీంతో రైతులు మామిడిపై ఆసక్తి చూపడంలేదు.



రసాయనాలతో చెట్లు బలహీన పడ్డాయి

మితిమీరిన రసాయన ఎరువుల వాడకంతో మామిడిచెట్లు బలహీనపడ్డాయి. పూత పెరిగి కాయ రావడానికి కల్టర్ రసాయనం ఎరువు వాడి దానికి తగ్గట్టుగా సరైన పోషకాలు పెట్టాలి. ఇలా చేయకపోవడంతో చెట్టు 15 ఏళ్లకే బలహీనపడుతోంది. నాలుగేళ్లుగా తేనె మంచుపురుగు, ప్రతికూల వాతావరణంతో పూత నిలబడటంలేదు.

- సునీల్, ఉద్యానశాఖాధికారి.



శ్రీవారి సేవలో ఎంపీ కృష్ణప్రసాద్



తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా సిబ్బంది లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

రుణాల ఇంటర్వ్యూలకు 392 మంది హాజరు



అభ్యర్థితో మాట్లాడుతున్న అధికారులు

పాకాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 392 మంది హాజరయ్యారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలకు మండలానికి 51 యూనిట్లు మంజూరయ్యాయి. ఆన్‌లైన్‌లో 511 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీవో అరుణ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకులకు సంబంధించిన అధికారులు ఇంటర్వ్యూ చేశారు.

తెప్పను పరిశీలించిన ఎస్పీ

తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పుష్కరిణిలో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు జరుగనున్నాయి. ఈక్రమంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చే తెప్పను ఇప్పటికే టీటీడీ సిద్ధం చేసింది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుమల పోలీసు అధికారులతో కలిసి పుష్కరిణిలోని తెప్పను పరిశీలించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన అంశాలపై స్థానిక పోలీసులతో చర్చించారు. ఆయన కొన్ని సూచనలు చేశారు.

లారీని ఢీకొన్న బస్సు నలుగురికి స్వల్ప గాయాలు



రేణిగుంట మార్చి 4(ఆంధ్రజ్యోతి): లారీని బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన కొత్త చెక్ పోస్ట్ కూడలి వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు... తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్తున్న ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్ చెక్‌పోస్ట్ కూడలి వద్ద కడప వైపు వెళ్తున్న లారీ వెనుక భాగాన్ని రాసుకుంటూ వెళ్లింది. దీంతో బస్సు మధ్య భాగంలో కిటికీ పక్కన కూర్చున్న నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని కండక్టర్ చికిత్స నిమిత్తం ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. ఈ విషయమై అర్బన్ పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

చెవిరెడ్డి అక్రమాస్తులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తా

● టీడీపీ మహిళానేత సుధారెడ్డి

చంద్రగిరి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమాస్తులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని టీడీపీ మహిళా నేత పులివర్తి సుధారెడ్డి అన్నారు. మంగళవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఆమె విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. తొలుత ఆమె చెవిరెడ్డికి ఫోన్ చేశారు. అయితే ఆయన ఫోన్ కట్ చేశారు. అనంతరం సుధారెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి నిరాధార ఆరోపణలతో మహిళలను కించపరిచేలా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. ఓటమితో విచక్షణ కోల్పోయి వ్యక్తిగత దూషణలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. ఐదేళ్లలో ఆయన అన్నివిధాలా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటే చెవిరెడ్డి జైలుకు వెళ్తారని వ్యాఖ్యానించారు. ఆధారాలతో ముఖాముఖికి రావాలని సవాల్ చేశారు. రూ.50 లక్షల లంచం తీసుకున్నట్టు ఆధారాలుంటే బయటపెట్టాలన్నారు. తాను సాయంత్రం వరకు చంద్రగిరి టవర్ క్లాక్ దగ్గరే ఉంటానని, తాను అవినీతికి పాల్పడ్డానని ఆధారాలుంటే ఇక్కడకు తీసుకురావాలని చెవిరెడ్డికి ఆమె సవాల్ విసిరారు. చెవిరెడ్డి అక్రమ ఆస్తుల వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. తుడా ఛైర్మన్‌గా చేసిన అవినీతిపై ఆధారాలు బయటకు వస్తున్నాయన్నారు. చెవిరెడ్డి అక్రమాస్తులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. మఠం భూములను దోచుకున్నారని విమర్శించారు. బుధవారం నుంచి చెవిరెడ్డి అవినీతిపై పోరాటం ప్రారంభిస్తానన్నారు. వీరి అవినీతి ఆస్తుల కరపత్రాలను ఇంటింటికీ పంచిపెడతానని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.



ఎన్నికల్లో చెవిరెడ్డి సమర్పించిన అఫిడవిట్‌ను చూపిస్తున్న సుధారెడ్డి

చెవిరెడ్డి కుటిల ప్రయత్నం: టీడీపీ

నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడమే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటిల ప్రయత్నమని టీడీపీ సీనియర్ నాయకులు మొక్కల కుమారరాజారెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నాని చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని ప్రయత్నిస్తూ, చెవిరెడ్డి ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇలాంటి కుటిల ప్రయత్నాలు ఆపుకోవాలన్నారు. టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, రూరల్ మండలం టీడీపీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి , సుబ్రమణ్యంనాయుడు, తిరుమలరెడ్డి, బాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరల్లేక రైతుల ఆందోళన

మొదలు కాని వరి కొనుగోలు కేంద్రాలు ● కళ్లాల్లోనే మినుము



విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

కేవీబీపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గత ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురవడంతో మండల రైతులు వరి సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. సుమారు 8 వేల హెక్టార్లలో వరి వేశారు. దిగుబడి కూడా బాగానే వచ్చింది. అయితే ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలో కేవీబీపురం, అంజూరు, మిద్దెకంఢ్రిగ, రాగిగుంట, ఎగువ పుత్తూరుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పా టు చేశారు. ప్రస్తుతం మండలంలో అం జూరులో మాత్రమే కొనుగోలు కేంద్రం ఏర్పా టైంది. అక్కడ 75 కిలోల బస్తాకు రూ.1,700గా ప్రభుత్వం నిర్ణయించింది. గత యేడాది 75 కిలోల బస్తా రూ.2వేల నుంచి రూ.2,200 వరకు పలికింది. ఈ యేడాది ప్రస్తుతం రూ.1,600 నుంచి రూ.1,700 మాత్రమే పలుకుతోంది. దళారులు రైతుల నుంచి 75 కిలోల బస్తాను రూ. 1,500 నుంచి రూ.1,600 కొనుగోలు చేస్తున్నారు. ఇక వరితో పాటు మినుము వేసిన రైతులు గిట్టుబాటు ధరలు లేక పండించిన పంటను ఇంకా కళ్లాల్లో, ఇళ్ల వద్దనే నిల్వ చేసి ఉంచారు. క్వింటాలు రూ.6,500 నుంచి రూ.7వేలకు దళారులు ధర నిర్ణయించడంతో రైతులు విక్రయించడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వం ధర నిర్ణయిస్తుందేమోనని ఎదురుచూస్తున్నారు. గిట్టుబాటు ధర కల్పించి మిగతా కేంద్రాలను త్వరగా తెరవాలని రైతులు కోరుతున్నారు.

కారు సహా ఎర్రచందనం దుంగల స్వాధీనం

కల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కారులో తరలిస్తున్న 8 ఎర్రచందనం దుంగలను పులిచెర్ల మండలంలో మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పులిచెర్ల మండలం 106 రామిరెడ్డిగారిపల్లి గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు గస్తీ చేపట్టారు. వీరికి గ్రామస్తులు సహకరించారు. వేకువజామున చిన్నగొట్టిగల్లు వైపు నుంచి రెండు ద్విచక్రవాహనాలు రావడాన్ని పోలీసులు గమనించారు. స్థానికులతో కలిసి పోలీసులు ద్విచక్ర వాహనాలను వెంబడించారు. ఓ ద్విచక్రవాహనంలో వెళుతున్న వ్యక్తి పోలీసులను గమనించి వాహనాన్ని వదిలి పారిపోయాడు. ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు స్థానికులతో కలిసి చుట్టుపక్కల వ్యవసాయ పొలాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. పోలీసులకు సహకారం అందించిన మండల జనసేన పార్టీ అధ్యక్షులు చంద్రబాబు మామిడితోటలో ఆగి ఉన్న ఓ కారుని గుర్తించారు. పోలీసుల గస్తీని పసిగట్టిన స్మగ్లర్లు కారును మామిడితోటలో వదిలిపెట్టి పారిపోయారు. కారుతో పాటు 8 ఎర్రచందనం దుంగలు, ద్విచక్రవాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కారు డిక్కీలో ఎర్రచందనం దుంగలు

రేపు తలకోనలో మారు పొంగళ్ల వేడుక

ఎర్రావారిపాలెం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మారు పొంగళ్ల ఉత్సవం గురువారం జరగనుంది. మహాశివరాత్రి అనంతరం ఎనిమిది రోజులకు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈసందర్భంగా ఆలయ ఈఓ రవీంద్రరాజు, దేవస్థానం ఛైర్మన్ సోమనాథరెడ్డిలు ఇందుకోసం ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది.

హరినాయుడి మృతికి సంతాపం

చంద్రగిరి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు హరినాయుడు మృతి బాధాకరమని ఎమ్మెల్యే నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. మంగళవారం చంద్రగిరి మండలం, కల్‌రోడ్డుపల్లె పంచాయతీ కొత్తఇండ్లు గ్రామానికి పులివర్తి సుధారెడ్డి చేరుకుని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు దేశినేని హరినాయుడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు పంచాయతీ కాంప్లెక్స్ గదుల వేలం

పిచ్చాటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీ గంగాధరంరెడ్డి పంచాయతీ కాంప్లెక్స్‌లోని 23 గదులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కేజీ రోసిరెడ్డి ప్రకటించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేలంలో పాల్గొనే వారు ధరావతు చెల్లించాల్సి ఉందన్నారు. సాల్వేషన్ సర్టిఫికెట్ పొందడానికి స్థానిక పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రేపు చేపల చెరువులకు వేలం పాట

పాకాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దామల చెరువు పంచాయతీ పరిధిలోని 13 చేపల చెరువులకు గురువారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి తెలిపారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందన్నారు. తగిన దరావతు చెల్లింపాటలో పాల్గొనాలన్నారు. నాయనిచెరువు, కమ్మవెంకట్రాయని చెరువు, లింగన్న చెరువు, వెంకట్రామా చెరువు, ఓబన్న చెరువు. వీరయ్య గుంట, బందార్లపల్లె చెరువు, పచ్చిపాల ఎల్లప్ప కుంట, మేడసానికుంట, కొత్తచెరువు, తిమ్మప్పనాయని కుంట, వెంకటకృష్ణారెడ్డి చెరువు, కామాక్షమ్మ చెరువులకు వేలం పాట నిర్వహిస్తామన్నారు.

కుట్రపూరిత రాజకీయాలు మానుకోవాలి : టీడీపీ

భాకరాపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు కుట్రపూరిత రాజకీయాలు మానుకోవాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే నాని కుటుంబంపై చెవిరెడ్డి బురద జల్లడం తగదన్నారు. దినేష్ రెడ్డి అనే వైసీపీ కార్యకర్త, పంచాయతీ కార్యదర్శి కుట్రపూరితంగా వ్యవహరించి నాని సతీమణిపై దుష్ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. టీడీపీ నాయకులు రాజగోపాల్ నాయుడు, చోటా సాహెబ్, బెల్లంకొండ రమణ, ఎర్రయ్య నాయుడు, రఫీ, కృష్ణారెడ్డి, మల్లిఖార్జున పాల్గొన్నారు.

ఉపాధిలో అవకతవకలపై చర్యలు

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్

బాలాయపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.14.70 కోట్ల వ్యయంతో జరిగిన పనులపై గత ఇరవై రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆరుగురు డీఆర్పీలు ఆరు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో జరిగిన పనులను పరిశీలించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలను వెల్లడించారు. అక్రమాలకు పాల్పడిన పిగిలాం, మన్నూరు పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. నిడిగల్లు, పిగిలాం, పెరిమిడి, వెంగమాంబపురం, బైరవరం, కడగుంట, కాలగంద, మన్నూరు, కయ్యూరు, జయంపు గ్రామాల పనుల్లో అక్రమాలు జరగడంతో రూ.245298 రికవరీకి ఆదేశించారు. అలాగే రూ.198200 జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మురళీ మోహన్ రెడ్డి, ఎంపీడీవో వినీల్‌కుమార్, ఏపీడీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: ఉపాధి పనుల్లో తప్పుచేసిన వారు శిక్ష అనుభవించాల్సిందేనని పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 15 ఆర్థిక సంఘం నిధుల ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 20పంచాయతీల్లో ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయన్నారు. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక మేటును సస్పెండ్ చేసి సొమ్ము రికవరీ చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి పనుల్లో అక్రమాలను వెల్లడిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

నేటి నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

వాకాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 5నుంచి 14వ తేదీ వరకు ఉపాధి తనిఖీ గ్రామసభలు ఆయా సచివాలయాల్లో జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.

ముగిసిన సైన్స్ వారోత్సవాలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి, పక్కనే డీఈవో తదితరులు

తిరుపతి (విద్య), మార్చి4(ఆంధ్రజ్యోతి): జాతీయసైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూలులో నిర్వహించిన సైన్స్ వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా గాదంకి నేషనల్ అట్మాస్ఫిరిక్ రీసెర్చ్ లేబొరేటరీ డైరెక్టర్ ఏకే పాత్రో విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌ని వివరించారు. జాతీయ వాతావరణ పరిశోధనాస్థానాన్ని విద్యార్థులు సందర్శించి వాతావరణ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని కోరారు. విశిష్ట అతిథిగా హాజరైన డాలర్స్ గ్రూప్స్ అధినేత డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని పెంచుకుని భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. డీఈవో కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ తిరుపతిలో పలు విశ్వవిద్యాలయాలు ఉన్నాయని వీటిని వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, సెమినార్ పోటీల్లో ప్రతిభచాటిన వారికి బహుమతులు అందజేశారు. అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ శంకరయ్య, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, హెచ్‌ఎం షకీనమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న హరికృష్ణ

తిరుపతి (ఆటోనగర్) మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ఈ నెల 10వ తేదీ విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామని ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఆర్.హరికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో యూనియన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు పి.వెంకటరత్నం, అంగన్వాడీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సరికొత్త ప్రాజెక్టులను రూపొందించండి



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ ప్రకాష్

తిరుపతి (విద్య), మార్చి4(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చదివే విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి సమాజానికి ఉపయోగపడే సరికొత్త ప్రాజెక్టులను రూపొందించాలని రిసోర్స్‌పర్సన్ కేవీఎస్ ప్రకాష్ తెలిపారు. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఫైనలియర్ విద్యార్థులకు మంగళవారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే స్టార్టప్స్ కూడా ప్రారంభించవచ్చని తెలిపారు. చదువుతోపాటు కమ్యూనికేషన్, లైఫ్ స్కిల్స్‌పై పట్టు సాధించాలని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి, జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ హెడ్ జీఎస్ రాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంగళం ట్రెండ్స్ పాఠశాలలో నేడు సరస్వతి విగ్రహ ప్రతిష్ట



తుదిమెరుగులతో సిద్ధమవుతున్న సరస్వతి విద్యామందిరం

తిరుపతి అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మంగళం జిల్లా పరిషత్ ఉన్నత ట్రెండ్స్ పాఠశాలలో బుధవారం రాత్రి సరస్వతిదేవి విగ్రహప్రతిష్ఠ, గురువారం ఉదయాత్పూర్వం కలశస్థాపన, మహాకుంభాభిషేకం జరగనుంది. దాదాపు 770మంది విద్యార్థులున్న ప్రాంగణంలో చదువులతల్లి సరస్వతి మండపం లేకపోవడం అసంతృప్తిగా ఉందని పాఠశాల యాజమాన్యం భావించింది. దీంతో జిల్లాలో ఎక్కడా లేని విధంగా 15అడుగుల ఎత్తు, 10అడుగుల వెడల్పు (చతురస్రాకారం)తో మండపం నిర్మించారు. తిరుపతికి చెందిన విశ్వనాథనాయుడు రూ. 50వేలు విరాళమిచ్చారు. టీటీడీ ఇచ్చే రాయితీ, 3.6అడుగుల ఎత్తుతో సరస్వతి విగ్రహం తెప్పించారు. మండపం చుట్టూ ఇనుపగ్రిల్స్‌కు రమేష్‌నాథ్ లింగుట్ల అనే దాత రూ. లక్ష విరాళం అందించారు. మరో దాత విజయలక్ష్మి రూ. 30వేలతో గ్రానైట్ పరిచారు. ఇక ఉపాధ్యాయులందరూ నగదు విరాళాలు అందించారు.

రికార్డులు లేని 22 వాహనాల సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని తనపల్లి క్రాస్ నుంచి ఆర్‌సీ పురం జంక్షన్ వరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేశారు. అక్కడ రికార్డులు లేని 19 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్, ఒక కారు, ఒక ఆటో, మొత్తం 22 వాహనాలు సీజ్ చేశారు.

ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన వైద్యాధికారి



తిరుపతిరూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం గ్రామ ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ మంగళవారం సందర్శించారు. పలు ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి కేసులో నిందితులకు రుయాలో వైద్య పరీక్షలు



నిందితులను రుయాస్పత్రికి తీసుకొచ్చిన సిట్ అధికారులు

తిరుపతి (వైద్యం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్తీ నెయ్యి కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితులను మంగళవారం వైద్య పరీక్షల నిమిత్తం సిట్ అధికారులు రుయాస్పత్రికి తీసుకొచ్చారు. నిందితులు విపిల్‌జైన్, అపూర్వ చావడలను సిట్ కస్టడీకి ఇచ్చేందుకు కోర్టు అనుమతిచ్చింది. దీంతో వీరిని కస్టడీకి తీసుకునేందుకు అవసరమైన వైద్య పరీక్షల కోసం సిట్ అధికారులు రుయాస్పత్రికి తీసుకువచ్చారు. రుయాలో వైద్యులు నిందితులను పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరించడంతో తిరిగి వారిని కస్టడీకి తీసుకువెళ్లారు.

తిరుపతి

ఎమ్మెల్సీల విజయంపై టీడీపీ సంబరాలు

తిరుపతి, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి ఘనవిజయం సాధించడం పట్ల తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి కార్యాలయంలో మంగళవారం సంబరాలు చేసుకున్నారు. ఎన్డీఏ బలపరిచిన ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పెరా బత్తుల రాజశేఖర్, కూటమి బలపరిచిన పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీనివాసులునాయుడు భారీ మెజారిటీతో గెలుపొందడం అభినందనీయని పేర్కొన్నారు.ఈసంబరాల్లో తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి యశ్వంత్ రెడ్డి, మీడియా పార్లమెంట్ కో-ఆర్డినేటర్ చెంగయ్య, ఎస్సీ సెల్ మురళి, పురుషోత్తం పాల్గొన్నారు. కాగా గెలుపొందిన ఎమ్మెల్సీలకు డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు.

బస్సుపాసు జారీ కేంద్రం మార్పు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 4(ఆంధ్రజ్యోతి): సీటీఎస్ ఏడుకొండల బస్టాండులో ఉన్న బస్సుపాసు జారీ కేంద్రానికి మరమ్మతులు ప్రారంభించారు. దీంతో బస్సు పాసుల జారీ కేంద్రాన్ని తాత్కాలికంగా శ్రీనివాస బస్టాండులోని 27వ ప్లాట్‌ఫామ్ వద్దకు మార్చారు. ఈ మేరకు ఏటీఎం రామచంద్రనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

స్వచ్ఛ తిరుపతి మన చేతుల్లోనే

ప్రజలతో పాటు కార్మికుల సంక్షేమం ముఖ్యం ● మనమంతా ఒక కుటుంబం

● సమస్యలుంటే నాతో పంచుకోండి ● మున్సిపల్ సిబ్బంది సమావేశంలో కమిషనర్ మౌర్య

తిరుపతి, మార్చి4(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ తిరుపతి మనచేతుల్లోనే ఉందని మున్సిపల్ కమిషనర్ మౌర్య తెలియజేశారు. నగరంలో పచ్చదనం- పారిశుధ్యం ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు అమలు చేయాల్సిన ప్రణాళికలపై మహతి ఆడి టోరియంలో మంగళవారం నగరపాలక సంస్థ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో పచ్చదనం - పరిశుభ్రత పెంచడంలో మీరు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలతో మమేకమై వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తే మరిన్ని ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. మనమంతా ఓ కుటుంబమని ఏవైనా





సమస్యలుంటే తనతో పంచుకోవచ్చని తెలియజేశారు. పారిశుధ్య కార్మికుల సేవలు ఎప్పటికీ గొప్పవేనన్నారు. సచివాలయ కార్యదర్శులు అందరూ ప్రతి రోజూ విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అధికారులు కిందిస్థాయి సిబ్బందితో కలిసి మెలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. తూకివాకం వద్ద చెత్త నిర్వహణ కేంద్రాన్ని అందరూ సందర్శించాలన్నారు. తిరుపతి ఉత్తమ ర్యాంకు సాధించాలంటే అందరూ కలసికట్టుగా పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హసీమ్, డీఈలు, ఏసీపీలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లపై పార్కింగ్ వాహనాలు తొలగించండి

తిరుపతి, మార్చి4(ఆంధ్రజ్యోతి): నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్ట్‌ల వద్ద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ మౌర్య ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం ఉదయం 41, 35వ వార్డుల్లో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునిక్రిష్ణ, ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లలో నెలల తరబడి అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మురుగునీటి కాలువలు కొన్నిచోట్ల లీక్ అవుతున్నా యని వాటిని బాగు చేయిస్తున్నామని అన్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, డీఈలు మధు, రమణ, శిల్ప. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి, ఏసీపీ మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.



35వ వార్డులోమురుగునీటి కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు

ఎస్పీ కార్యాలయ సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ



తిరుపతి(నేరవిభాగం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యో గులు, సిబ్బందికి మంగళవారం ఎస్పీ హర్షవర్ధన రాజు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్లు వా డాలని ఆదేశించారు. లైసెన్సు, వాహనాలకు రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ రామ కృష్ణమాచారి, సీఐ సంజీవ్‌కుమార్, భాస్కర్, ఎస్ఐ పాల్గొన్నారు.

పోటాపోటీగా టీటీడీ ఉద్యోగుల క్రీడలు



క్యారమ్స్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

తిరుపతి(క్రీడలు), మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీటీడీ వార్షిక క్రీడలు పోటాపోటీగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన టెన్నికాయిట్ సింగిల్స్‌లో ధామరసెల్విపై కుమారిదేవి విజయం సా ధించారు. డబుల్స్‌లో రమాదేవి, నారాయణమ్మ జట్టుపై కుమారిదేవి, ధామరసెల్వి జట్టు గెలుపొందింది. బాల్ బాడ్మింటన్ మహేష్‌పై సుభాష్‌చంద్రబోస్ విజ యం సాధించగా మధుసూదన్‌శర్మపై బాబు గెలుపొందారు. క్యారమ్స్ సింగిల్స్‌లో సుధారాణిపై, స్వప్న మంజరి విజయం సాధించగా డబుల్స్‌లో రాజేశ్వరి, సుధారాణి జట్టుపై సులోచన, స్వప్నకుమారి జట్టు విజయం సాధించింది.

చేనేత శాఖలో బది‘లీలలు’

● ప్రభుత్వ అనుమతిలేకుండా కమిషనర్ వర్క్ ఆర్డర్

తిరుపతి,మార్చి4(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర చేనేత, జౌళి శాఖలో ఓ బదిలీ వ్యవహారం వివాదంగా మారింది. సంబంధిత శాఖ మంత్రి ఓఎస్డీ ఇచ్చిన లేఖ ఆధారంగా చేనేత, జౌళిశాఖలో జాయింట్ డైరెక్టర్ హోదాతో ఆప్కో జనరల్ మేనేజర్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఎం.నాగేశ్వరరావును హిందూపురంలోని తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రం (టీసీపీఎ్‌ఎకే) ప్రిన్సిపల్‌గా బదిలీ చేస్తూ ఆశాఖ కమిషనర్ రేఖారాణి సోమవారం వర్క్ ఆర్డర్ జారీచేశారు. చేనేత, జౌళిశాఖ తిరుపతి రీజనల్ డైరెక్టర్‌గా ఇంచార్జి బాధ్యతలతో పాటు టీసీపీఎ్‌ఎకే ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న జి.రాజారావును జనరల్ మేనేజర్‌గా నియమించాలని విజయవాడలోని ఆప్కో మేనేజింగ్ డైరెక్టర్, వీసీని ఆలేఖలో పేర్కొన్నారు. ఇప్పుడీ వర్క్ ఆర్డరే కలకలం రేపుతోంది. రాజారావుకు పదోన్నతి కల్పించాలనే ఉద్దేశ్యంతోనే తెరవెనుక ఆశాఖలోని ఓ కీలక అధికారి చక్రంతిప్పినట్టు ప్రచారం జరుగుతోంది. చేనేత, జౌళిశాఖలో జాయింట్ డైరెక్టర్ (జేడీ)నుంచి పైస్థాయి వరకు బదిలీ చేయాలంటే ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయాల్సి ఉంటుంది. కమిషనర్ స్థాయి అధికారికి జేడీలను బదిలీ చేసే అధికారం ఉండదు. కేవలం మంత్రి ఓఎస్డీ ఇచ్చిన లేఖ ఆధారంగా చేసుకుని వర్క్ ఆర్డర్ పేరిట బదిలీ చేయడంపై ఆ శాఖ ఉద్యోగులు భగ్గుమంటున్నారు. వర్క్ ఆర్డర్ ఇవ్వాలంటే వారానికో, పదిరోజులకో ఏదైనా ప్రత్యేక పరిస్థితులప్పుడే వెసులుబాటు ఉంటుంది. అలాంటి సమయం ఏమీ పెట్టకుండా ఆప్కోకు జీఎంగా నియమించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఫలానా వాళ్లను నియమించవచ్చని ప్యానెల్ కమిటీకి ప్రతిపాదనలు పంపే అధికారం మాత్రమే కమిషనర్‌కు ఉంటుంది. వీటన్నింటినీ పట్టించుకోకుండా కమిషనర్ ఇష్టానుసారంగా వ్యవహరించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తున్నట్టు తెలుస్తోంది.

ఆమె అంటే హడల్

● వైసీపీ ప్రభుత్వంలో స్విమ్స్‌లో కీలక బాధ్యతలు

● కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్న హవా

తిరుపతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో ఆమె పేరు చెబితే నర్సింగ్ సిబ్బంది హడలెత్తిపోతారు. ఎదురు మాట్లాడితే విధినిర్వహణలో చుక్కలు చూపిస్తారన్న ఆరోపణలున్నాయి. ఓ ఫోర్జరీ కేసులో పోలీస్ కేసుతో పాటు పదేళ్ల కిందట సస్పెన్షన్‌కు గురైన ఆమె 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్లీన్‌చిట్‌తో తిరిగి విధుల్లోకి హాజరయ్యారు. స్విమ్స్ నర్సింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు ఈ వైసీపీ వీరవిధేయురాలు. గతంలో తన కుటుంబ సభ్యుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం తహసీల్దారు సంతకాన్ని ఫోర్జరీ చేసిన అభియోగాలపై సస్పెండయ్యారు. వైసీపీకి అండగా నిలిచే కీలక సామాజిక వర్గానికి చెందిన ఆమె ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మంత్రి, ఇద్దరు ముఖ్య నాయకుల అండతో క్లీన్‌చిట్‌తో విధుల్లో చేరారు. సస్పెన్షన్ కాలంలో రావాల్సిన జీతం దాదాపు కోటి రూపాయలను వెనక్కి తెచ్చుకున్నారు. ఆమె ఒత్తిళ్లతో పలువురు నర్సింగ్ సిబ్బంది రాజీనామా చేసి వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. మెడికల్ లీవ్ తీసుకోవాలంటే వణికిపోతున్నారు. వారికి ఆరోగ్యం బాగలేకపోయినా వెంటనే స్పందించి ఉచిత వైద్యం అందించేందుకు సహకరించరన్న విమర్శలు ఉన్నాయి. ఈఎల్, సీఎల్ పెట్టుకున్నా లాస్‌ఆఫ్ పే కింద జీతం కట్‌చేస్తారని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. స్విమ్స్‌లోని నర్సింగ్ బాయ్స్ సిబ్బంది బాధ్యతలను కూడా ఆమె చేతుల్లోకే తీసుకుని వేధిస్తున్నట్టు విమర్శలున్నాయి. గడిచిన ఐదేళ్లపాటు వైసీపీ పెద్దల సేవలో తరించారు. ఎన్నికల ముందు తిరుపతి వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ గెలుపుకోసం ఆత్మీయ సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడమే కాకుండా నేరుగా వేదికను పంచుకుని ఉపన్యాసాలిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఆమె అదే హవాను కొనసాగిస్తున్నారు.

మద్యం షాపు తొలగించే వరకు పోరాటం ఆగదు : సీపీఐ



బ్రాందీ దుకాణం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తిరుపతి (ఆటోనగర్) / తిరుపతి (నేరవిభాగం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): సాయినగర్ వద్ద ఇళ్ల మధ్య మద్యం దుకాణం తొలగించే వరకు పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి స్పష్టం చేశారు. సాయినగర్ వద్ద మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ సాయినగర్ గ్రామస్తులు సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ స్థానిక పద్మావతి పార్కు వద్ద బైరాగిపట్టెడ రోడ్డు నుంచి అవిలాలకు వెళ్లే దారిలో రెసిడెన్షియల్ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం తగదన్నారు. ఇక్కడ టీటీడీ విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నివాసం వుంటున్నారన్నారు. మరోవైపు ఇండియన్ బ్యాంకు, 60 పడకల ఆస్పత్రి, మూడు పాఠశాలలు ఉన్నాయన్నారు. మహిళలు రోజూ దాదాపు 1000 మంది బ్యాంకు వద్దకు రుణాల కోసం ఇదే దారిలో వస్తుంటారని అన్నారు. విద్యార్థినులు, మహిళలు మందు బాబులతో ఇక్కట్లు పడే ప్రమాదం ఉందన్నారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో బుధవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కానిపక్షంలో ఈ నెల 10న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయినగర్, లింగేశ్వర్ నగర్ ప్రజలు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచులయ్య, నగర కార్యదర్శి విశ్వనాద్, జిల్లా సమితి సభ్యులు శ్రీరాములు, రామక్రిష్ణ, నాగరాజ్‌ప్రమీల, పద్మనాభరెడ్డి, రత్నమ్మ, గుర్రప్ప, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

వీధివ్యాపారుల సమగ్ర సర్వే జరపాలి



వీధివ్యాపారుల మహాసభలో మాట్లాడుతున్న ఓబులేసు

తిరుపతి(ఆటోనగర్) మార్చి4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వీధివ్యాపారుల వివరాలపై ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు కోరారు. తిరుపతిలో మంగళవారం జరిగిన తిరుపతి జిల్లా వీధి వ్యాపారుల సంఘం రెండవ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. దేశంలో 2 కోట్ల 60 లక్షల మందికి పైగా వీధివ్యాపారులు ఉన్నారన్నారు. జిల్లాలో 30 వేల మందికి పైగా ఉన్నారని తెలియజేశారు. కాంట్రాక్టర్లు వారి నుంచి అధికమొత్తంలో డబ్బులు వసూలు చేస్తుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వారిపట్ల అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు వేధింపులు మానుకోవాలని తెలియజేశారు. రాష్ట్రంలోని వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.

భారీ ర్యాలీ: అంతకుముందు వీధి వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో అన్నమయ్య కూడలి నుంచి ఎయిర్ బైపాస్ రోడ్డు, బైరాగిపట్టెడలోని పలువీధుల మీదుగా సీపీఐ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజానాట్య మండలి కళాకారులు తమ విప్లవ గీతాలు, డప్పు ప్రదర్శనలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ శివకుమార్, టి.వెంకటేశ్వర్లు, పి.మురళి, కె.రాధాక్రిష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌డీ.రవి, వైఎస్ మణి, నాగేంద్ర, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



భక్తులను కలిసి అభిప్రాయ సేకరణ చేస్తున్న శ్రీవారి సేవకులు

నమస్కారం.. చెప్పండి మీ అభిప్రాయం!

● టీటీడీలో మొదలైన 'ఫీడ్‌బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టమ్'

తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం, సేవలు, దర్శనానికి వచ్చిన సమయంలో కలిగిన ఇబ్బందులు వంటి అంశాలపై భక్తుల నుంచి టీటీడీ అభిప్రాయ సేకరణ మొదలైంది. ఏపీ డిజిటల్ కార్పొరేషన్ సహకారంతో 'ఫీడ్ బ్యాక్ మేనేజ్మెంట్ సిస్టమ్' ప్రారంభించారు. భక్తుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు మూడు పద్ధతులను టీటీడీ ఏర్పాటు చేసుకుంది. ఐవీఆర్ఎస్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్ సిస్టమ్), వాట్సాప్ మెసెజ్ మోడ్, ఫిజికల్ సర్వే ల ద్వారా అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. దీనికి 'నివేదన' అనే పేరును పెట్టారు. ఐవీఆర్ఎస్, ఫిజికల్ సర్వే పద్ధతలను టీటీడీ ఫిబ్రవరి నుంచి అమలు చేస్తోంది.

అన్నీ బావున్నాయి!

గత నెల 14 నుంచి 20వ తేద వరకు శ్రీవారిని దర్శించుకున్న వారిలో 36,385 మందికి కాల్స్ వెళ్లగా అందులో 13,294 మంది స్పందించారు. వీరిలో 61.12 శాతం మంది బాగుందనగా, 27 శాతం పర్వాలేదని, మరో 11.88 శాతం బాగాలేదనే జవాబులిచ్చారు. ఫిబ్రవరి మొదటి వారంలో 2,244 మంది భక్తులను ఫిజికల్ సర్వేతో 9 ప్రశ్నలు అడిగారు. 72.5 శాతం బాగుందని, 18.7 శాతం పర్వాలేదని, 8.8 శాతం బాగోలేదనే సమాధానాలు అందాయి. దీని ద్వారా ఆ సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఆయా విభాగాలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాగా వాట్సాప్ మెసెజ్ మోడ్‌ను కూడా ప్రారంభించనున్నారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,683

తలనీలాలు సమర్పించినవారు: 23,453



ఫటా ఫట్

తిరుపతిలో జాతీయస్థాయి ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. తూకివాకం వద్ద 35ఎకరాల్లో క్రీడాప్రాంగణం ఏర్పాటుకు శాప్‌చైర్మన్ రవినాయుడు కృషి చేస్తున్నారు. మరోపక్క క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. జిల్లాలో క్రీడాభివృద్ధికి జరుగుతున్న కృషి గురించి జిల్లా క్రీడాధికారి సయ్యద్ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారిలా..

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

రెండేళ్లలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

● జిల్లా క్రీడాధికారి సయ్యద్

స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులెంతవరకు వచ్చాయి?

ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుకున్న శ్రీనివాస క్రీడా సముదాయ అభివృద్ధి పనులను రూ.2కోట్లతో మొదలుపెట్టాం. ఇండోర్ స్టేడియంలో న్యూ ఉడెన్ ఫ్లోరింగ్, పెయింటింగ్, పైఅంతస్తులో రైఫిల్ షూటింగ్, జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. వాకింగ్‌ట్రాక్ పునరుద్ధరిస్తున్నాం. టెన్నిస్‌కోర్టు, సింథటిక్ లేయర్స్, గాల్వనైజింగ్ ఫెన్సింగ్‌కు రంగులు, ఈతకొలను మరమ్మతులు, గార్డెన్, మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీనా వంటి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రాల పరిస్థితి ఏమిటి?

చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడులలో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నాం. ఐదేళ్లుగా మరుగునపడిన ఈ కేంద్రాలను బాగుచేయడానికి ప్రభుత్వం అనుమతించింది. పెవిలియన్ బిల్డింగ్, ఇండోర్ స్టేడియం, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడా సౌకర్యాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నాం. సంరక్షకులు, సిబ్బంది నియాకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్ కాంప్లెక్స్ ఎప్పటికి పూర్తవుతుంది?

శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో తూకివాకం దగ్గర 35ఎకరాల భూమిని పరిశీలించాం. కలెక్టర్ ఇక్కడే ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. స్పోర్ట్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రాజెక్టు ప్రారంభమై పనులు చురుగ్గా సాగితే రెండేళ్లలో రెడీ అవుతుందని అనుకుంటున్నాం.

కోచ్‌ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారా?

కోచ్‌ల భర్తీపై ప్రభుత్వానికి నివేదించాం. హాకీ, ఫుట్‌బాల్, జూడో,రెజ్లింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్,వాలీబాల్, టెన్నిస్, ఖేలోఇండియా, హాకీ శిక్షకులు అందుబాటులో ఉన్నారు.

ఈసారి సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తారా?

ఈఏడాది 25వంతున రూరల్, అర్బన్ ప్రాంతాలను ఎంపికచేసి మెరుగ్గా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తాం. ఈ బాధ్యతలను ఔత్సాహిక పీడీ, పీఈటీలకు అప్పగిస్తాం. ఇందుకు గ్రాంట్స్ ఇస్తాం. ప్రతిభ చాటిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తాం.



మేమింతే.. మారమంతే!







నిబంధనలదేముందీ.. సవాలక్ష ఉంటాయి. అమలు చేయాలి కదా! తిరుపతి నగరంలో ఐదేళ్లు సాగిన అస్తవ్యస్త ట్రాఫిక్ వ్యవస్థే ఇప్పటికీ చెక్కుచెదరకుండా కొనసాగుతోంది. కూడళ్లలో ట్రాఫిక్ పోలీసుల ఆచూకీ చాలాసార్లు కనిపించదు. కనిపించినా వారిది ప్రేక్షక పాత్ర మాత్రమే. ఉల్లంఘిస్తున్నారని ఎవర్నైనా ఆపితే.. ఎలాగూ నాయకుల నుంచి ఫోన్లు వస్తాయని అనుకుంటున్నారేమో.. చేతికి ఏదీ అంటకుండా గడిపేస్తున్నారు. ఏకంగా గరుడ వారధి మీదే ఎదురు ప్రయాణాలు సాగుతూ ఉంటాయి. ఎర్ర లైటు వెలుగుతున్నా కూడళ్లలో దూసుకుపోతూనే ఉంటారు. ఇక ఒకే వాహనం మీద ముగ్గురు కాదు.. నలుగురూ, ఐదుగురూ కూడా రయ్ మంటూ ప్రమాదాలను వెతుక్కుంటూ వెళ్లిపోతుంటారు. ఇంత గందరగోళపు ట్రాఫిక్‌లోనూ మొబైల్‌లో మాట్లాడుతూ ఫీట్‌లు చేస్తుంటారు. తిరుపతి నగర ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ పనితీరుకు సాక్ష్యమే మంగళవారం కనిపించిన ఈ దృశ్యాలు..

-తిరుపతి, ఆంధ్రజ్యోతి

రేణిగుంటలో ఎండీయూ ఆపరేటర్ నిర్వాకం

● కాటాకు అయస్కాంతం అంటించి బియ్యం పంపిణీ

● 10 కిలోలకు కిలో స్వాహా

రేణిగుంట మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్ నిర్వాకంపై రేషన్ కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యంలో కాటాకు అయస్కాంతం అంటించి ప్రతి 10 కిలోలకు కిలో స్వాహా చేస్తున్న సంఘటన మంగళవారం అత్తూరు గ్రామంలో వెలుగు చూసింది. స్థానిక కార్డుదారులు తెలిపిన వివరాలు... అత్తూరులో ప్రతి నెలా ఎండీయూ ఆపరేటర్ గిరి గ్రామానికి చేరుకుని కార్డుదారులకు రేషన్ సరుకులు అందిస్తుంటాడు. అయితే మంగళవారం గ్రామంలో రేషన్ అందిస్తుండగా కాటాకు అయస్కాంతం అంటించి ఉండడాన్ని యువకులు గమనించి ఫొటోలు తీశారు. దీనిపై ఆపరేటర్ గిరిని ప్రశ్నించారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ గిరి బదులిచ్చారు. కాగా కార్డుదారులు మాట్లాడుతూ... గత వైసీపీ హయాం నుంచి ఆపరేటర్ ఇలాగే సరుకులు పంపిణీ చేస్తున్నాడని, దీనిపై పలుమార్లు వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. దీంతో యువకులు కాటాకు అయస్కాంతం అంటించిన ఫొటోను ఎమ్మెల్యేకు చేరేంత వరకు షేర్ చేయాలని హ్యాష్ ట్యాగ్ తగిలిచ్చి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడంతో మండలంలో వైరల్‌గా మారింది. ఈవిషయంపై తహసీల్దార్ సురేష్‌బాబుని వివరణ కోరగా... ఆపరేటర్ గిరిపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. మంగళవారం జరిగిన నిర్వాకం తన దృష్టికి వచ్చిందని అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు



కాటాకు అంటించిన అయస్కాంతం

అప్పుల బాధతో లైన్‌మ్యాన్ బలవన్మరణం

● విధులు నిర్వహిస్తున్న సబ్‌స్టేషన్‌లోనే ఘటన ● సూసైడ్ నోట్‌లో అప్పుల వివరాలు

ఓజిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక ట్రాన్స్‌కో లైన్‌మ్యాన్ సీహెచ్ మురళీకృష్ణ(57) మంగళవారం విధులు నిర్వహిస్తున్న సబ్‌స్టేషన్‌లోనే ఉరేసుకుని మృతి చెందాడు. ఓజిలి ఎస్‌ఐ స్వప్న కథనం మేరకు వివరాలు... ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన మురళీకృష్ణ కురుగొండ సబ్ స్టేషనులో లైన్‌మ్యాన్‌గా పని చేస్తున్నారు. చాలాకాలంగా భార్యతో కలిసి నాయుడుపేటలో నివాసం ఉంటున్న ఆయన సోమవారం ఉదయం విధులకు వెళ్లారు. మంగళవారం ఉదయం 9 గంటలకు రిలీవ్ అవ్వాల్సి ఉంది. 8 గంటల సమయంలో ఏఈ అనిల్ ఫోన్ చేయగా మురళీకృష్ణ లిఫ్ట్ చేయలేదు. మళ్లీ మళ్లీ ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మరో ఉద్యోగిని సబ్‌స్టేషను వద్దకు పంపారు. అతను వెళ్లి ఎంతసేపు తలుపు కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా మురళీకృష్ణ శ్లాబ్ కొక్కికి ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే ట్రాన్స్‌కో ఏడీ, ఏఈతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సబ్‌స్టేషను వద్దకు చేరుకుని తలుపులు పగలగొట్టి మురళీకృష్ణ మృతదేహాన్ని కిందికి దింపారు. రికార్డులు పరిశీలించగా సోమవారం రాత్రి 12 గంటల వరకు విద్యుత్ రీడింగ్ నమోదు చేసినట్లు ఉంది. ఒంటిగంట నుంచి రీడింగ్ నమోదు చేయకపోవడంతో రాత్రి 12 - 1 గంట మధ్య ఉరేసుకుని ఉంటాడని ఎస్‌ఐ స్వప్న తెలిపారు. మురళీకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉరికి వేలాడుతున్న మురళీకృష్ణ

అప్పుల వివరాలతో లేఖ

మురళీకృష్ణ ఉరేసుకునే ముందు తాను చేసిన అప్పుల వివరాలు రాసిపెట్టిన లేఖ సబ్‌స్టేషన్‌లో లభ్యమైంది. మొత్తం 26 మంది వద్ద అప్పు చేశానని, అందులో ఏడుగురు లాటరీ వాళ్లు ఉన్నట్లు తెలిపాడు. 19 మందికి రూ.7.71లక్షలు, ఏడుగురు లాటరీ వాళ్లకు రూ.60లక్షలు బాకీ ఉన్నట్లు లేఖలో పేర్కొన్నాడు. ఈ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇదేమి విడ్డూరం సారూ..!

● గతంలో పనిచేసిన అధికారికి విచారణ బాధ్యతలు

పుత్తూరు అర్బన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై ఆర్డీ విశ్వనాథ్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీలో విడ్డూరం నెలకొంది. 2019 నుంచి 2024 వరకు మున్సిపాలిటీలో అన్ని విభాగాల్లో అవినీతి జరిగిందని ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని సమగ్రస్థాయిలో విచారణ జరిపేందుకు కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే 2019 నుంచి నాలుగు సంవత్సరాల పాటు టౌన్ ప్లానింగ్ అధికారిగా సుభద్రప్రద పనిచేశారు. కాగా, నేడు పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతి అక్రమాల విచారణ బాధ్యతలను ఆమెకు అప్పగించారు. ఈ పరిణామంపై స్థానికులు విస్మయం చెందుతున్నారు. దీనివల్ల విచారణలో పారదర్శకత ఎంత మాత్రం ఉంటుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గూడ్స్ ఇంజిన్‌లో సాంకేతిక సమస్య అరగంట ఆలస్యంగా నడిచిన రైళ్లు

రేణిగుంట, మార్చ్ 4, (ఆంధ్రజ్యోతి): రైలు ఇంజన్లో సాంకేతిక సమస్య తలెత్తడంతో రేణిగుంట మీదుగా కడప వైపు వెళ్లాల్సిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు మంగళవారం రాత్రి అరగంట ఆలస్యంగా నడిచాయి. వివరాల్లోకి వెళితే... మంగళవారం రాత్రి 7 గంటల నుంచి రేణిగుంట మీదుగా కడప వైపు వెళ్లాల్సిన రాయలసీమ, కాచిగూడ, ఎగ్మోర్, వెంకట్రాద్రి ఎక్స్‌ప్రెస్‌లు హైదరాబాద్, సికింద్రాబాద్‌కు చేరుకోవాల్సి ఉంది. ఈక్రమంలో మామండూరు వద్ద రేణిగుంటకు వస్తున్న గూడ్స్ రైలు ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఇంజన్ పైలట్ గూడ్స్‌ను ఆపేశారు. దీంతో కడప రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను ఆపేశారు. ఇక్కడి నుంచి వెళ్లాల్సిన రైళ్లను పంపించారు. దీంతో ఈ రూటులో వెళ్లాల్సిన రైళ్లు అరగంట ఆలస్యంగా నడిచాయి.

న్యాయం కావాలంటూ..

● వెటర్నరీ విద్యార్థుల వినూత్న నిరసన

తిరుపతిరూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): న్యాయ దేవత వేషధారిణికి ఒక చేతిలో భారత రాజ్యాంగం. మరో చేతిలో త్రాసు. అందులో ఒక వైపు వెటర్నేరియన్ల కష్టం, ప్రొఫెషన్ ప్రాముఖ్యత బరువైన బ్లాకులుగా ఉంచారు. మరోవైపు తక్కువ మొత్తంలో స్టైఫండ్‌ని చిన్నపెట్టెలో ఉంచారు. విద్యార్థుల కష్టాల బరువు ఎక్కువగా ఉండటంతో త్రాసు సమతుల్యం కాదని.. న్యాయం ఎటువైపుకి ఒరగాలి.. అంటూ వెటర్నరీ విద్యార్థులు మంగళవారం వినూత్న తరహాలో నిరసన తెలిపారు. వైద్యవిద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలంటూ నెల రోజులుగా వీరు చేపట్టిన నిరవధిక సమ్మె.. మంగళవారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధానగేటు వద్ద ఏర్పాటు చేసిన దీక్షాశిబిరంలో విద్యార్థులు బైఠాయించి ప్లకార్డులు చేతపట్టారు. తమ హక్కులకోసం ప్రభుత్వాన్ని, వర్సిటీ అధికారులను వేడుకుంటున్నా గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య విద్యార్థుల వద్దకు వచ్చి వెంటనే సమ్మెని విరమించి తరగతులకు హాజరుకావాలని, లేకుంటే బుధవారం నుంచి హాస్టళ్ల మెస్‌లని మూసివేస్తామన్నారు. ఆ మరుసటిరోజున హాస్టళ్లు ఖాళీచేయాల్సి ఉంటుందని వివరించారు. హాస్టళ్లను మూసినా సమ్మె కొనసాగిస్తామని విద్యార్థులు అంటున్నారు.

నేటినుంచి మెస్ సేవలు నిలిపివేత

నెల రోజులుగా తరగతులను బహిష్కరించి సమ్మెబాటలో ఉన్నందున్న బుధవారం నుంచి హాస్టళ్లకి అనుబంధంగా ఉన్న మెస్‌సేవలను నిలుపుదల చేస్తూ వర్సిటీ అధికారులు నోటీసు జారీ చేశారు. ఈమేరకు విద్యార్థులకు మెస్‌సేవలు ఉండవని, అలాగే గురువారానికి హాస్టళ్లని పూర్తిస్థాయిలో ఖాళీ చేయాల్సిఉందని నోటీసులో పేర్కొన్నారు.



నా వ్యక్తిగత సమస్యను రాజకీయం చేస్తున్నారు

● రెండు పార్టీల నేతలపై లక్ష్మీరెడ్డి విమర్శ

తిరుపతి(వైద్యం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'నా ఆర్థిక లావాదేవీల సమస్యకోసం నేను మీడియా ముందుకు వచ్చా. ఆ సమస్యను ఆసరాగా తీసుకొని అధికార, ప్రతిపక్ష నేతలు వారి రాజకీయ లబ్ధి కోసం సోషల్ మీడియాలో తప్పుగా ట్రోల్స్ చేస్తున్నారు' అని ఇటీవల కిరణ్‌రాయల్‌పై ఆరోపణలు చేసిన లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'నేను నా ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన ఒక్క వీడియో మాత్రమే విడుదల చేశా. అది కాకుండా సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్న మిగతా వీడియోలు, ఫొటోలన్నీ కొందరు రాజకీయ లబ్ధి కోసం పోస్టు చేశారు. అందులో నా ప్రమేయం లేదు. కిరణ్‌రాయల్ సొంత పార్టీకి చెందిన నేతలే ఏడాది కిందట నా వద్దకొచ్చి న్యాయం చేస్తామని చెప్పి ఆధారాలు తీసుకెళ్లారు. ప్రతిపక్ష పార్టీ నేతలతో కలిసి ఇప్పుడు వాటిని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో జనసేనకు చెందిన జిల్లా నేత ప్రమేయమే ఎక్కువగా ఉంది. ఇలా నా వ్యక్తిగత సమస్యను రాజకీయ లబ్ధికోసం రెండు పార్టీల నేతలు నాకు తెలియకుండా, నా విషయాన్ని తప్పుగా ప్రచారం చేశారు. దీనిపై ఇప్పటికే నేను ఆ నేతలపై ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశా. నాకే పార్టీతోనూ.. నేతలతోనూ సంబంధం లేదు. నా సమస్య పరిష్కారానికే పోరాటం చేశా. ఇప్పుడు నా ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌ను చూసి నా బిడ్డలు ఇంతటితో దీనికి ఫుల్‌స్టాప్ పెట్టమని కోరడంతో, దీనిని ఇంతటితో ముగిద్దామనుకుంటున్నా' అని ఆమె పేర్కొన్నారు. జనసేన పార్టీలోని ఆ జిల్లా నేత ఎవరని మీడియా ప్రతినిధులు అడగ్గా.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అన్నీ తెలిపానన్నారు. ఇప్పటి వరకు ఏ పార్టీ నేతలూ తనకు మద్దతుగా లేరని, ఎవరి నుంచీ బెదిరింపులు లేవని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఒకవేళ ఉంటే జనసేన పార్టీకి చెందిన జిల్లా నేత నుంచి ప్రాణహాని ఉండొచ్చని, ఈ విషయాన్ని పోలీసులకూ చెప్పానన్నారు. వాళ్లు తనకు న్యాయం చేస్తారని బదులిచ్చారు.



ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం వర్సిటీలు, కాలేజీల బంద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఉమ్మడి పీజీసెట్ రద్దు చేయాలంటూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీల బంద్ చేపట్టారు. పీజీ ప్రవేశాలు నిర్వహించుకునే వెసులుబాటు యూనివర్సిటీలకే అప్పగించాలని కోరుతూ కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న వీరు బంద్‌కు పిలుపునిచ్చారు. యూనివర్సిటీలు, కాలేజీలను విద్యార్థి నేతలు కలియతిరుగుతూ బంద్ పర్యవేక్షించారు. ఎస్వీయూనివర్సిటీలో విద్యార్థి సంఘాలన్నీ బంద్ సందర్భంగా ర్యాలీ చేపట్టాయి. యూనివర్సిటీలోనే బైఠాయించి నిరసన తెలిపాయి. ఉమ్మడి పీజీసెట్ వల్ల రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఇప్పటికే పీజీ ప్రవేశాలు భారీగా తగ్గాయని గుర్తుచేశారు. భవిష్యత్తులో యూనివర్సిటీలే మూత పడే ప్రమాదం ఉందన్నారు. పీజీ అడ్మిషన్లు యూనివర్సిటీలే నిర్వహించుకునేటప్పుడు యూనివర్సిటీల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాన్నే కూటమి ప్రభుత్వం కూడా అనుసరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివారెడ్డి, చలపతి, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, అక్బర్, ఎన్ఎస్‌యూఐ నేత జెన్నే మల్లికార్జున, లా విద్యార్థి సంఘ నేత సుందర్రాజు, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



బంద్‌లో పాల్గొన్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు

తిరుమలలో మెరుగైన సేవలపై నివేదిక



ఈవో శ్యామలరావుతో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు

తిరుమల, మార్చి4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత బాధ్యతగా, మెరుగ్గా, సేవలందించేందుకు సత్యసాయి సేవా సంస్థకు చెందిన నలుగురు సభ్యుల బృందం సమగ్ర నివేదికను రూపొందించింది. బృందం సభ్యులు మంగళవారం తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలో ఈవో శ్యామలరావును కలిసి నివేదికను అందజేశారు. దేశంలో పేరొందిన ఆధ్యాత్మిక సంస్థల నిర్వహణాపరమైన సూచనలను, సలహాలను తీసుకుని అమలు చేయాలనే సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వీరు గతనెల 28 నుంచి ఐదురోజుల పాటు తిరుమలలో పరిశీలించి నివేదికను తయారుచేశారు. సభ్యులు రఘుపాత్రుని లక్ష్మణరావు, చుండూరి సురేంద్ర, కొమరగిరి శ్యాంప్రసాద్, విశ్వనాథరెడ్డిలు పలు సూచనలతో ఈవోకు నివేదిక సమర్పించారు. వీరిని శ్యామలరావు అభినందించారు. నివేదికలోని అంశాలు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతాయని ఈవో అభిప్రాయపడ్డారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

గూడూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక సునీత సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన జీవన శైలిలో వచ్చిన మార్పుల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. మనం తీసుకునే ఆహారం రసాయన పదార్థాలతో నిండిఉండడం వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. జంక్ ఫుడ్, పొగాకు వినియోగం, మద్యపానం, శారీరక శ్రమ లేకపోవడం, నిల్వ చేసిన ఆహర పదార్థాలను తినడం వల్ల క్యాన్సర్‌కు కారణమవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్కసారి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే నివారణ సులభతరంగా ఉంటుందన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సారంగం సులక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది కన్యాకుమారి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై వేధింపులు ఆపాలి



మోపూరు రోడ్డులో గిరిజన సంఘం నేతల నిరసన ర్యాలీ

డక్కిలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో కొంతమంది అటవీ అధికారులు గిరిజనులను వేధింపులకు గురిచేస్తున్నారని రాష్ట్ర యానాది సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. అటవీశాఖ అధికారుల వేధింపులకు నిరసనగా మంగళవారం సాయంత్రం గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. మోపూరు సర్వే నెంబరు 1లో ఉన్న అటవీ భూమిని గిరిజనులు ఆక్రమించడంతో అటవీ అధికారులు అడ్డుకున్నారు. దీంతో గిరిజనులు హైకోర్టును ఆశ్రయించారు. గిరిజన సంఘం నాయకులతో కలిసి స్థానికులు మరోమారు అటవీ భూములను ఆక్రమిస్తారని సమాచారం అందడంతో పోలీసులు, అటవీశాఖ అధికారులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం గిరిజన సంఘ నాయకులు మోపూరు మీదుగా ఆల్తూరుపాడులో ఓ గిరిజన కుటుంబాన్ని పరామర్శించేందుకు ర్యాలీగా వెలుతుండగా అటవీ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అటవీ అధికారులకు, గిరిజన సంఘ నేతలకు వాద్వాదం చోటు చేసుకొంది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో వెంకటగిరి సీఐ రమణ, డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. కోర్టులో ఉన్న భూమి మీదుగా ర్యాలీ నిర్వహించేందుకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో గిరిజన సంఘాల నాయకులు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. గిరిజనుల పట్ల డీఆర్వో ప్రతాప్‌రెడ్డి కక్షపూరిత ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. ర్యాలీలో జిల్లా రైతు కూలీ సంఘం నాయకుడు రమణయ్య, సీపీఎం నాయకుడు చెంగయ్య, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి చలపతి, భాస్కర్, చెంబేటి ఉష, మురళి, సతీష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

నాయుడుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం నాయుడుపేట తుమ్మూరు ఎల్ఏ సాగరం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్ల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి వారికి కనీసం వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, సీఐటీయూ నాయకులు శివకవి, ముకుందా, రోజా, అప్పన్న, బాగ్యమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన పెళ్లకూరు నేతలు



పల్లా శ్రీనివాస రావుతో టీడీపీ నాయకులు

పెళ్లకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావును పెళ్లకూరు మండలానికి చెందిన నేతలు మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు పనిచేయాలని పల్లా సూచించారు. శ్రీనివాస రావును కలిసిన వారిలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, మదన్ మోహన్ నాయుడు, మాడుపూరు మురళీనాయుడు ఉన్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల పరిశీలన

నాయుడుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు కోసం అందిన దరఖాస్తులను మున్సిపల్ కమిషనరు షేక్ ఫజులుల్లా మంగళవారం పరిశీలించారు. పట్టణానికి 50 యూనిట్లు కేటాయించగా 25 వార్డుల నుంచి 558 దరఖాస్తులు అందాయన్నారు. ఇందులో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు 15 యూనిట్లు, కెనరా బ్యాంకు-10, ఇండియన్ బ్యాంకు 10, యూనియన్ బ్యాంకు-1 నుంచి 7 యూనిట్లు, యూనియన్ బ్యాంకు-2 నుంచి 8 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. దరఖాస్తుదారుల అర్హతలు, సిబిల్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేస్తామని చెప్పారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు చైతన్యంతో బాల్య వివాహాలను నిర్మూలిద్దామని అంగన్‌వాడీ సూపర్ వైజర్ కవిత పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిట్టేడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, తల్లులకు ఆరోగ్యం, పిల్లల పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం పౌష్టికాహార ఆవశ్యకత, బాల్యవివాహాల నిర్మూలనపై చిట్టేడులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు సునీత, సుధామాధవి, సునీత, మణెమ్మ పాల్గొన్నారు.

నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో మార్చి 31 వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని సీఐ మురళీకృష్ణ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆంక్షలు విధించామన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని పేర్కొన్నారు.

ఆటో బోల్తా

నాయుడుపేట టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఆటో ఉన్న విద్యార్థులకు, ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

సాంకేతిక సమస్యతో ఆగిన మెము రైలు

చిల్లకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి నెల్లూరుకు వెళుతున్న మెము రైలు సాంకేతిక సమస్యతో మండలంలోని ఓడూరు రైల్వేస్టేషన్‌లో మంగళవారం రెండుగంటల పాటు నిలిచిపోయింది. స్థానికుల వివరాల మేరకు... చెన్నై నుంచి నెల్లూరుకు వెళుతున్న మెము రైలు ఓడూరు రైల్వేస్టేషన్‌కు ఉదయం 9గంటలకు చేరుకుంది. సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉదయం 11గంటల వరకు ఆపేశారు. మరమ్మతులు చేసిన అనంతరం చెన్నై బయలుదేరింది. ప్రయాణికులను పట్నా రైలులో నెల్లూరుకు పంపారు.

వాడవాడలా సిమెంటు రోడ్లు

రూ.2.21 కోట్లతో 6.4 కిలో మీటర్ల మేర నిర్మాణం

పెళ్లకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెళ్లకూరు మండలంలో సిమెంటు రోడ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సహకారంతో మండలంలోని 24 పంచాయతీల్లో 6.4 కిలో మీటర్ల పొడవున సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.2.21 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో అనకవోలు రూ.5 లక్షలు, బంగారంపేట రూ.20లక్షలు, చావాలి రూ.26లక్షలు, చెంబేడు రూ.19లక్షలు, చిల్లకూరు రూ.7 లక్షలు, చింతపూడి రూ.9 లక్షలు, కానూరు రూ.15లక్షలు, కలవకూరు రూ.10లక్షలు, ముమ్మారెడ్డిగుంట రూ.4లక్షలు, నందిమాల రూ.5లక్షలు, నందిమాల రూ. 9లక్షలు, పెళ్లకూరు రూ.8 లక్షలు, పునబాక రూ.9 లక్షలు, కొత్తూరు రూ.8 లక్షలు, శిరసనంబేడు రూ.8 లక్షలు, తాళ్వాయిపాడు రూ 5 లక్షలు, పెన్నేపల్లి రూ.5లక్షలు, జీలపాటూరు రూ.18 లక్షలు, చెన్నప్ప నాయుడుపేట రూ.8లక్షలు, పుల్లూరు రూ.8లక్షలు, అర్దమాల గ్రామానికి రూ.15లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఆయా గ్రామాల్లోని అంతర్గత రహదారులను సిమెంటు రోడ్లుగా మార్చుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లూ బురదమయంగా ఉన్న మట్టి రోడ్లలో తిరగలేక ఇబ్బందులు పడ్డామని, కూటమి ప్రభుత్వంతో గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నెలబల్లిలో సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఈఈ రమణయ్య

ఆదేవిధంగా రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు సొసైటీ గోడౌన్‌ల వద్దకు సిమెంటు రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1.02 కోట్లు మంజూరు చేసింది. ఇందులో చెంబేడు గోడౌన్‌కు రూ.64.80లక్షలు, చిల్లకూరు గోడౌన్‌కు రూ.1.20లక్షలు, నెలబల్లి గోడౌన్‌కు రూ.21లక్షలు మంజూరు చేసింది. మండలంలో ఇప్పటి వరకు 5.9 కిలోమీటర్లకు పైగా సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశామని, మిగిలినవి త్వరలో పూర్తవుతాయని పంచాయతీరాజ్ ఏఈ వెంకటేష్ తెలిపారు.

ఉపాధిలో అవకతవకలపై చర్యలు

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్

బాలాయపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.14.70 కోట్ల వ్యయంతో జరిగిన పనులపై గత ఇరవై రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆరుగురు డీఆర్పీలు ఆరు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో జరిగిన పనులను పరిశీలించారు. మంగ ళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలను వెల్లడించారు. అక్రమాలకు పాల్పడిన పిగిలాం, మన్నూరు పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. నిడిగల్లు, పిగిలాం, పెరిమిడి, వెంగమాంబపురం, భైరవరం, కడగుంట, కాలగంద, మన్నూరు, కయ్యూరు, జయంపు గ్రామాల పనుల్లో అక్రమాలు జరగడంతో రూ.245298 రికవరీకి ఆదేశించారు. అలాగే రూ.198200 జరిమానా విధించారు. కార్యక్ర మంలో ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మురళీ మోహన్ రెడ్డి, ఎంపీడీవో వినీల్‌కుమార్, ఏపీడీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనుల్లో అక్రమాలను వెల్లడిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

తప్పుచేస్తే శిక్ష అనుభవించాల్సిందే

వెంకటగిరి టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో తప్పుచేసిన వారు శిక్ష అనుభవించాల్సిందేనని పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళ వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 15 ఆర్థిక సంఘం నిధుల ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 20పంచాయతీల్లో ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయన్నారు. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక మేటును సస్పెండ్ చేసి సొమ్ము రికవరీ చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

వాకాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 5నుంచి 14వ తేదీ వరకు ఉపాధి తనిఖీ గ్రామసభలు ఆయా సచివాలయాల్లో జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.

మూడు సవర్ల బంగారు సరుడు అపహరణ

నాయుడుపేట టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్లూరు గ్రామంలో మహిళ మెడలో నుంచి మూడు సవర్ల బంగారు సరుడు గుర్తు తెలియని దుండగుడు అపహరించుకుని వెళ్లాడు. నాయుడుపేట పట్టణంలోని పిండివారి తోటలో నివాసముంటున్న సుభాషిణి పండ్లూరు గ్రామంలో ఉంటున్న తన తల్లిని చూసేందుకు బయలుదేరింది. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళుతుండగా మోటరు సైకిల్ వచ్చిన గుర్తుతెలియని దుండగుడు సుభాషిణి మెడలో నుంచి మూడు సవర్ల బంగారు సరుడు లాక్కొని పారారయ్యాడు. బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఏటీఎం కార్డు మార్చి రూ.10వేల అపహరణ

నాయుడుపేటటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డు మార్చి రూ.10వేలు నగదు అపహరించిన ఘటన పట్టణంలోని బజారువీధిలో చోటు చేసుకుంది. పెళ్లకూరు మండలం అనకవోలు గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ మంగళవారం ఉదయం నాయుడుపేట పట్టణానికి చేరుకుని బజారు వీధిలో ఉన్న ఏటీఎం వద్దకు వెళ్లింది. అదే సమయంలో ఓ యువకుడు నగదు డ్రా చేసి ఇస్తానని వెంకటసుబ్బమ్మ దగ్గర నుంచి ఏటీఎం కార్డును తీసుకున్నాడు. నగదు డ్రా కాలేదంటూ వేరే ఏటీఎం కార్డును ఆమెకు ఇచ్చి వెళ్లిపోయాడు. కొంత సేపటి తరవాత ఆ మహిళ సెల్‌ఫోన్‌కు రూ.10వేలు నగదు డ్రా అయినట్లు మేసేజ్ వచ్చింది. ఆమె వద్దనున్న ఏటీఎం కార్డును పరిశీలించగా నకిలీదని తెలియడంతో లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

సర్వీసు రోడ్ల నిర్మాణానికి కృషి చేయండి



ఎంపీ గురుమూర్తిని కలిసిన రైతులు

నాయుడుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలంలో సాగరమాల రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మించేలా చూడాలంటూ రైతులు మంగళవారం తిరుపతి ఎంపీ గురుమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగరమాల రోడ్డు 13 అడుగులకు పైగా ఎత్తులో నిర్మిస్తున్నారని, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇరు వైపులా ఉన్న పంట పొలాలకు దారి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ బ్రిడ్జిల నుంచి సర్వీసు రోడ్లు ఏర్పాటు చేస్తే తమ పంట పొలాలకు, ఆయా ప్రాంతాల గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు ఉండవన్నారు. ఎంపీని కలిసిన వారిలో రైతులు జలదంకి వెంకట కృష్ణారెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, విజయలురెడ్డి, సునీల్ ఉన్నారు.

జీవవైవిధ్యంపై అవగాహన కలిగివుండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లలితకుమారి

గూడూరు అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జీవవైవిధ్యంపై విద్యార్థులు అవగాహన కలిగివుండాలని నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాల జువాలజీ అధ్యాపకురాలు డాక్టర్ లలితకుమారి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీవ వైవిధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవవైవిధ్యం ప్రకృతి సమతుల్యానికి దోహదపడుతుందన్నారు. వణ్యప్రాణులకు పరిరక్షించుకోవడం, కనుమరుగైపోతున్న జీవజాతులను సంరక్షించాకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, విజయ మహేష్, పీర కుమార్, శ్రీధర్‌శర్మ, కిరణ్మయి, నారాయణరాజు, హిమబిందు, రవిరాజు, శైలజ, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించండి

గూడూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక టవర్ క్లాక్‌సెంటర్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో ఆటోలకు పార్కింగ్ స్థలాలను కేటాయించాలన్నారు. ఆటోలకు ఈ-చలానా నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. పెంచిన రోడ్ ట్యాక్స్ తగ్గించాలన్నారు. మోటర్ రంగంలోని కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, నారాయణ, ప్రభాకర్, శశికుమార్, రమేష్, కృష్ణ, రాజా, ముని, అంకయ్య, అరవింద్, దశయ్య, సాయి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

గూడూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేసేలా అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం తిరుపతిలోని జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో గూడూరు నియోజకవర్గ నాయకులు సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తిరుపతి ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో మోహన్, శేఖర్, వెంకటరమణ, కార్తీక్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో గూడూరు జనసేన నాయకులు

జాతరలో దుకాణాలకు వేలం

చిల్లకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ జాతర సందర్భంగా దుకాణాల నిర్వహణకు మంగళవారం దేవాదాయశాఖ అధికారులు వేలం పాటలు నిర్వహించారు. భక్తుల తలనీలాలు సేకరణకు రూ.4,01,000, గుడిపై భక్తులు వేసే మొక్కులకు రూ.27,000, పాదరక్షలు భద్రపరుచుకునేందుకు రూ.19,000, సిద్దవరం వైపు పార్కింగ్‌కు రూ.22,000, వేయి కళ్ల కుండలు విక్రయించుకునే దుకాణాల వేలం ద్వారా రూ.3,01,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

కోట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం గ్రామానికి చెందిన ప్రవళిక తన భర్త శివయ్య, ఆయన కుటుంబ సభ్యులు వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు.

ఐటీఐలో తరగతి గదుల ఆధునికీకరణ



గదులను ప్రారంభిస్తున్న శ్రీసిటీ ఐమాప్ ప్రతినిధులు

తడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీ సెజ్‌లోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రవేట్ లిమిటెడ్ (ఐమాప్) పరిశ్రమ స్థానిక ఐటీఐలో తరగతి గదులను ఆధునికీకరించింది. పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల నుంచి సుమారు రూ.7.5 వెచ్చించి తరగతి గదుల మరమ్మతులు, డెస్కులు, బల్లలు ఏర్పాటు చేశారు. వీటిని శ్రీసిటీ డైరెక్టర్ నిరీష సన్నారెడ్డి, ఐమాప్ ఎండీ టాయిజో ఇవామీ లాంఛనంగా మంగళవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవదానం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

చిల్లకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని సీడీపీవో మెహబూబి అన్నారు. మంగళ వారం మండలంలోని పారిచెర్లవారిపాళెం ఎస్టీ కాలనీలోని అంగన్ వాడీ కేంద్రంలో బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుకమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఓజిలిలో బీసీ రుణ మేళా

ఓజిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలిలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ రుణ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఓజిలి, ఆరిమేనిపాడు యూనియన్ బ్యాంకు, కురుగొండ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు రుణమేళా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

7 నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు వేణుగోపాల స్వామి ఆలయంలో ఈనెల 7నుంచి 13 బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు శెల్వం తెలిపారు. 7న అంకురార్పణతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు వారంలో రోజులపాటు వైభవంగా జరుగుతాయన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పేర్నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పనిచేసే మహిళా వైద్య సిబ్బందికి వైద్యాధికారి సత్యవేటి రమణయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు ప్రధానం చేస్తామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. 1వ నెంబరు ప్లాట్‌ఫారం వద్దనున్న బుకింగ్ కౌంటర్ సమీపంలో బ్యాగు తల కిందపెట్టుకొని మృతి చెంది ఉన్నాడు. నిద్రలో గుండెపోటుకు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ చెన్నకేశవులు చెప్పారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు రోటరీ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీక్లబ్ గవర్నర్ గోపాలకృష్ణ

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు రోటరీ క్లబ్ సేవలను విస్తరిస్తున్నామని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ సాధు గోపాలకృష్ణ తెలిపారు. కోటలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో మంగళవారం రోటరీ క్లబ్ నెల్లూరు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సంస్థలు ఉన్న ఏకైక సంస్థ రోటరీక్లబ్ అన్నారు. రూ.5 వేల కోట్లతో పోలియో నిర్మూలన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కొవిడ్ సమయంలో ఈ సేవలను మరింత విస్తృతం చేసి ప్రజల మన్ననలు పొందామన్నారు. సమావేశంలో రోటరీక్లబ్ ప్రతినిధులు పసుపులేని కిషోర్, మధుయాదవ్ పాల్గొన్నారు.

దళిత, గిరిజన కాలనీల్లో తాగునీటి సరఫరాకు చర్యలు

కోట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో దళిత, గిరిజన కాలనీలకు తాగునీరు సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో గోపి తెలిపారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాలెం దళితవాడలో తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్లను ఆయన పరిశీలించారు. సాగరమాల రోడ్డు విస్తరణ పనుల్లో పైపులైన్లు ఇటీవల ధ్వంసమయ్యాయి. దీంతో కాలనీలకు తాగునీరు ఇబ్బందికరంగా మారింది. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆదేశాల మేరకు ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ వెళ్లి తాగునీటి ట్యాంకులు, పైపులైన్లను పరిశీలించారు. తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

గూడూరు అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు రోడ్డు నిబంధనలను పాటించకుంటే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు కూడళ్ల వద్ద ఆటోలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి ఇతర వాహన దారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తప్పనిసరిగా సరైన ధృవీకరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండాల లీలావతి

చిల్లకూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడూరు గ్రామానికి చెందిన విద్యార్థినిని రేణుకకు చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. రేణుక తల్లిదండ్రులు ఇద్దరూ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో విద్యార్థినికి ట్రస్ట్ తరపున రూ.10వేలు నగదు అందించినట్లు ట్రస్ట్ సభ్యులు ప్రజేంద్రరెడ్డి, బాబు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి గుండాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో సమాచారం కరువు

సూళ్లూరుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు వద్దనున్న కంట్రోల్ పాయింట్‌లో ప్రయాణికులకు సమాచారం కరువైంది. ప్రయాణికులకు నిరంతరం సమాచారం అందించేందుకు కంట్రోల్ పాయింట్‌లో చేసి సిబ్బందిని నియమించి మొబైల్ ఫోన్ అందుబాటులో ఉంచారు. అయితే కంట్రోల్ పాయింట్‌లోని 8500122389 నెంబరుకు ఫోన్‌చేస్తే ఎవరూ తీయడం లేదని, ఆర్టీసీ అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని ప్రయాణికులు చెబుతున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

మూడు వారాలుగా ఆధార్ కేంద్రం మూత



మూతపడిన ఆధార్ కేంద్రం - కాటూరులో ఆధార్ చేయడం జరుగుతుందని అంటించిన నోటీసు బోర్డు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాల యంలో మూడు వారాలుగా ఆధార్ కేంద్రం మూతపడడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ బదిలీ కావడంతో సచివాలయంలో ఆధార్ సేవలు నిలిచిపోయాయి. ప్రజల ఒత్తిడితో కాటూరు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌తో వారంలో రెండు రోజులు పాటు ఆధార్ కేంద్రం నడిచే విధంగా అధికారులు చ ర్యలు తీసుకున్నారు. అయితే మూడు వారాలు నుంచి ఆధార్‌కు సంబంధించిన పరికరం పనిచేయలేదని డిజిటల్ అసిస్టెంట్ రావడం మానేశారు. అవసరమైన వారు కాటూరు సచి వాలయానికి రావాలని కార్యాలయం వెలుపల నోటీసు అంటించారు. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పరికరాలకు మరమ్మతులు చేసి ఆధార్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. కాగా వెస్టవరవత్తూరు, పల్లమాల ఆధార్ కేంద్రాలు కూడా సరిగా పనిచేయడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గిట్టుబాటు ధర కల్పించడంలో 'కూటమి' విఫలం



ధాన్యాన్ని చూపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు అన్నారు శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలాల వద్ద రైతులను కలిశారు. గత సంవత్సరం కంటే ఈ యేడు ధరలు బాగా పడిపోయాయని రైతులు వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బాలగురవం బాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు రూ.25వేలు ఏడాదికి అందిస్తామని చెప్పిన పథకాన్ని వెంటనే అమలు చేసి ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ నేతలు కరీముల్లా, వేలు, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టండి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మాతా, శిశు మరణాలను అరికట్టడానికి ఆశా కార్యకర్తలు కృషి చేయాలని వైద్యాధికారి విద్యాసాగర్ ఆదేశించారు. బీఎన్‌కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆడపిల్లలను చదివించి 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. ప్రతి కాన్పు ఆస్పత్రిలో జరిగితే మాతా శిశు మరణాలు పూర్తిగా తగ్గుతాయని సీహెచ్‌వో వెంకటేశ్వర్లు చెప్పారు. గిరిజన గ్రామాల్లో బాల్య వివాహాలపై ప్రచారం చేయాలన్నారు. గర్భిణులు, పిల్లలకు ఏఎన్ఎంతో కలిసి టీకాలు వేయాలని సూచించారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ



శ్రీకాళహస్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి అనారోగ్యంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అక్కడికి చేరుకుని ఆయన్ను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై శ్రీనివాసుడి రాజసం



దర్బార్ అలంకారంలో వేంకటేశ్వరస్వామి - చంద్రప్రభ వాహనంపై స్వామివారు

శ్రీకాళహస్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమానుపురంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న అభయహస్త వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు చంద్రప్రభ వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. అంతకుముందు ఉదయం స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారు దర్బార్ అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి సర్వాలంకారభూషితుడైన స్వామివారు చంద్రప్రభ వాహనంపై ఆశీనులై గ్రామంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చి నిర్మాణానికి భూమిపూజ

కేవీబీపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కేవీబీపురంలో దార్నివర్ లూథరన్ చర్చి కళత్తూరు సబ్‌సెంటర్‌లో మంగళవారం బిషప్ మైఖేల్‌బాబు ఆధ్వ ర్యంలో భూమిపూజ చేశారు. ఈ కార్యక్ర మంలో విజయకుమార్, సంఘ పెద్దలు రాజబాబు, విజయభాస్కర్, దేశయ్య, డాని యల్ సహా 20మంది పాస్టర్లు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరల్లేక రైతుల ఆందోళన

మొదలు కాని వరి కొనుగోలు కేంద్రాలు ● కళ్లాల్లోనే మినుము



విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

కేవీబీపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గత ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురవడంతో మండల రైతులు వరి సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. సుమారు 8 వేల హెక్టార్లలో వరి వేశారు. దిగుబడి కూడా బాగానే వచ్చింది. అయితే ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలో కేవీబీపురం, అంజూరు, మిద్దెకండ్రిగ, రాగిగుంట, ఎగువ పుత్తూరుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మండలంలో అంజూరులో మాత్రమే కొనుగోలు కేంద్రం ఏర్పాటైంది. అక్కడ 75 కిలోల బస్తాకు రూ.1,700గా ప్రభుత్వం నిర్ణయించింది. గత యేడాది 75 కిలోల బస్తా రూ.2వేల నుంచి రూ.2,200 వరకు పలికింది. ఈ యేడాది ప్రస్తుతం రూ.1,600 నుంచి రూ.1,700 మాత్రమే పలుకుతోంది. దళారులు రైతుల నుంచి 75 కిలోల బస్తాను రూ.1,500 నుంచి రూ.1,600 కొనుగోలు చేస్తున్నారు. ఇక వరితో పాటు మినుము వేసిన రైతులు గిట్టుబాటు ధరలు లేక పండించిన పంటను ఇంకా కళ్లాల్లో, ఇళ్ల వద్దనే నిల్వ చేసి ఉంచారు. క్వింటాలు రూ.6,500 నుంచి రూ.7వేలకు దళారులు ధర నిర్ణయించడంతో రైతులు విక్రయించడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వం ధర నిర్ణయిస్తుందేమోనని ఎదురుచూస్తున్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి మిగతా కేంద్రాలను త్వరగా తెరవాలని రైతులు కోరుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



చిన్నారుల నృత్య ప్రదర్శనలు

శ్రీకాళహస్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం 4గంటలకు పట్టణానికి చెందిన తరణి నృత్య ప్రదర్శనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 4.30గంటలకు పట్టణానికి చెందిన హేమసాయి నృత్య ప్రదర్శన, 5గంటలకు పలమనేరుకు చెందిన నల్లూరి సరిత భరత్యనాట్య ప్రదర్శన, 5.30గంటలకు పట్టణానికి చెందిన అంజలి నృత్య ప్రదర్శన, 6 గంటలకు కృష్ణాజిల్లా కూచిపూడికి చెందిన తాడేపల్లి సాయికృష్ణ కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. 8గంటలకు నెల్లూరుకు చెందిన అనంతర హరహర నాట్య కళాక్షేత్రం కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన, 9గంటలకు హారిక, హేమవతి భరతన్యాటం, 9.30గంటలకు తిరుపతికి చెందిన సుగుణ నృత్య ప్రదర్శన భరతనాట్యం ఆహూతులను అలరించాయి. చివరగా పెద్దకనపర్తికి చెందిన సీతాలమ్మ నాట్యమండలికి చెందిన అక్కుర్తి సుబ్బరామయ్య ప్రదర్శించిన శ్రీకష్ణరాయభారం నాటికతో మంగళవారం నాటి సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి.

నేడు పంచాయతీ కాంప్లెక్స్ గదుల వేలం

పిచ్చాటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీ గంగాధరరెడ్డి పంచాయతీ కాంప్లెక్స్‌లోని 23 గదులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కేజీ రోసిరెడ్డి ప్రకటించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేలంలో పాల్గొనే వారు ధరావతు చెల్లించాల్సి ఉందన్నారు. సాల్వేషన్ సర్టిఫికెట్ పొందడానికి స్థానిక పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పల్లకీ సేవ జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని స్టేట్ బ్యాంకు 5 శాఖల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు వెంకటపతి, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారాతో జీవితం అస్తవ్యస్తం



కీలగరంలో నవోదయం అవగాహన సదస్సు

నారాయణవనం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సారా తాగితే జీవితం అస్తవ్యస్తంగా మారుతుందని, సారా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు కారణంగా కుటుంబం రోడ్డున పడుతుందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కీలగరంలో సారా తయారీ, విక్రయాలు, అనర్థాలపై నవోదయం 2.0 సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సారా జోలికి వెళ్లకపోతే పాత కేసులను మాఫీ చేయడమే కాకుండా కలెక్టర్ సహకారంతో చదువుకున్న యువతకు ఉద్యోగావకాశాలు, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, స్వయం ఉపాధికి బ్యాంకుల నుంచి రుణసాయం అందిస్తామని తెలిపారు. నాటుసారా వలన కలిగే దుష్ప్రభావాల గురించి గ్రామస్థులకు వివరించారు. ఎస్ఐలు అంజద్ బాషా, శివప్రసాద్, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి(ఆంధ్రజ్యోతి): సారా తయారు చేస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య హెచ్చరించారు. ఏర్పేడు మండలంలోని బత్తెనయ్య ఎస్టీకాలనీలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సారా తాగితే కలిగే అనర్థాలను వివరించారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ భాస్కర్, హెచ్‌సీ హరికుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో ఆదాయం

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చే విధంగా సర్పంచులు ప్రణాళికలు తయారు చేయాలని సూళ్లూరుపేట డీఎల్‌పీవో రవీంద్రబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి పంచాయతీలో తప్పనిసరిగా చెత్తను సేకరించి రీసైక్లింగ్ చేసి వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. రైతు లకు, ఇతరులకు విక్రయించి పంచాయతీకి ఆదాయం సమ కూర్చుకోవాలన్నారు.

లైన్‌మన్‌కు ప్రశంసాపత్రం



విజయ్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్ఈ

వరదయ్యపాళెం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడూరు పంచాయతీలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాడు. ఈ నేపథ్యంలో జాతీయ లైన్‌మన్ దినం సందర్భంగా విజయ్ సేవలను గుర్తించి ఎస్ఈ ప్రవీణ్‌కుమార్ ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఈఈ దేవాశీర్వాదం, డీఈ రమేష్, నాగలాపురం ఏడీ రమేష్, వరదయ్యపాళెం ఏఈ విజయ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలివ్వండి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాలు ఇవ్వాలని సర్పంచ్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపాళెం గిరిజనులు తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు వినితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో 10 కుటుంబాల గిరిజనులు ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలు దఫాలు అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. వీఆర్వో, ఆర్ఐ ద్వారా విచారణ చేపట్టి గిరిజనులకు ఇంటి స్థలాలు ఇస్తామని తహసీల్దార్ చెప్పారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

బుచ్చినాయుడుకండ్రగ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాన రహదారిలో రాకపోకలకు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ విశ్వనాథ నాయుడు హెచ్చరించారు. బీఎన్‌కండ్రిగ పట్టణంలో అడ్డదిడ్డంగా పెట్టిన పలు వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రోడ్డు మీద ఆటోలను ఆపి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల విద్యార్థులకు అంతరాయం కలిగించిన వాహనాలపై కేసులు నమోదు చేస్తామన్నారు.

లారీని ఢీకొన్న బస్సు నలుగురికి స్వల్ప గాయాలు



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

రేణిగుంట మార్చి 4(ఆంధ్రజ్యోతి): లారీని బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన కొత్త చెక్ పోస్ట్ కూడలి వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు... తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళ్తున్న ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్ చెక్‌పోస్ట్ కూడలి వద్ద కడప వైపు వెళ్తున్న లారీ వెనుక భాగాన్ని రాసుకుంటూ వెళ్లింది. దీంతో బస్సు మధ్య భాగంలో కిటికీ పక్కన కూర్చున్న నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని కండక్టర్ చికిత్స నిమిత్తం ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. ఈ విషయమై అర్బన్ పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

విద్యుత్ సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



లైన్‌మన్‌ను సన్మానిస్తున్న అధికారులు

పుత్తూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రాణాలు పణంగా పెట్టి కంటికి కనపడని విద్యుత్‌తో పనిచేసే సమయంలో సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తిరుపతి సర్కిల్ విద్యుత్ ఎస్ఈ సురేంద్ర నాయుడు అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో మంగళవారం లైన్‌మెన్ డేను ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో గ్లోవ్స్, బూట్లు ధరించాలని, విద్యుత్ సరఫరా ఆపివేయాలన్నారు. లైన్‌మన్ దేవరాజులు, అసిస్టెంట్ లైన్‌మన్ కపిల్‌ను సన్మానించారు. పుత్తూరు ఆపరేషన్స్ డీఈ దేవ ఆశీర్వాదం, కన్‌స్ట్రక్షన్స్ డీఈ బాలాజి, ఏడీఈలు శంకరయ్య, రమేష్, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

పుత్తూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొజ్జనత్తం ఎస్టీ కాలనీ, జ్యోతిబసు నగర్‌లో నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. వెంకటేష్, నందయ్య, సుబ్రమణ్యంపిళ్లై, వెంకటేశులు పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పఢావోపై అవగాహన



పుత్తూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేబీ ఆర్ పురం ఉన్నత పాఠశాలలో బాలికల సంరక్షణ, బాల్యవివాహాలపై మంగళవారంబేటీ బచావో బేటీ పఢావో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్వరూప, మధుమతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యం!



ఖాళీగా ఉన్న సచివాలయం-10 కార్యాలయం - సచివాలయం-11 లో ఇద్దరు మినహా ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

పుత్తూరు అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 9, 10, 11, 12 సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' సందర్శించగా సాయంత్ర 4 గంటలకు కార్యాలయాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు కార్యాలయాలకు వచ్చి సిబ్బంది లేకపోవడంతో వెనుదిరగడం కనిపించింది. ఆర్టీసీ కాలనీ సచివాలమ అడ్మిన్ ఎల్లవి ఏకంగా ఏడాది పాటు సెలవులో కొనసాగుతోంది. ఈ బాధ్యతలను ఎడ్యుకేషన్ సెక్రటరీ నిర్వర్తిస్తున్నారు. బీడీ కాలనీ, ఏజీ కాలనీ, కల్యాణపురం, ఎస్టీ కాలనీ, ముద్దుకృష్ణాపురం, వినాయకపురం, నెత్తం ప్రాంతాలకు చెందిన సచివాలయంలో మహిళా పోలీస్, ఎడ్యుకేషన్ సెక్రటరీ మినహా ఖాళీ కుర్చీలు కనిపించాయి. ఇక్కడ పనిచేసే వీఆర్వో మరో సచివాలయానికి ఇన్‌చార్జిగా వేశారు. ఆమె రెండు ప్రాంతాల్లో లేకపోవడం గమనార్హం. చిన్నరాజకుప్పం, చెర్లోపల్లి, ఆరేటమ్మ కాలనీ, ఎస్బీఐ కాలనీకి చెందిన సచివాలయంలో అడ్మిన్ ఇటీవల బదిలీ చేశారు. ఆ స్థానంలో ఇన్‌చార్జిగా ఎడ్యుకేషన్ సెక్రటరీ హేమనాథ్‌ను నియమించారు. లక్ష్మీనగర్ సచివాలయంలో కూడా సిబ్బంది కనిపించలేదు. ఇలా సచివాలయాల్లో ఉన్న సిబ్బంది విధులకు సక్రమంగా విధులకు హాజరుకాకపోవడం, మరికొందరు సెలవుల్లో వెళ్లడంతో ఉన్న వారిపై భారం పడుతుండటం సమస్యగా మారుతోంది. ఇటీవల అడ్మిన్ సెక్రటరీలో ప్రవర్తనలు బాగలేకపోవడంతో బదిలీలతో క్రమశిక్షణ చర్యలు చేపడుతున్నారు. సచివాలయం సిబ్బందిపై పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇంద్రవిమానంపై దేవేరులతో సుబ్రహ్మణ్యుడి విహారం



పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో కొలువై ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో 53 వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం అమ్మవార్ల సమేత స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు ఇంద్ర విమానాన్ని అధిరోహించి పట్టణంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.